

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 464 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 3 జూలై 2025 | వెల : 4/-



## నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి?

- డీకేఎస్ ఆసక్తికర వ్యాఖ్యలు
- బీజేపీ, జేడీఎస్‌ల సెటైర్లతో అది జరగొచ్చని జోరుగా ప్రచారం
- కర్ణాటకలో ముఖ్యమంత్రి త్వరలోనే మారతారంటూ ఊహాగానాలు
- “నన్ను సీఎంగా చేయాలని నేరు ఎవరినీ కోరలేదు
- నాకు మద్దతుగా మాట్లాడమని ఎవరినీ పురమాయించలేదు

2

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం

- తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం
- డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి భారతరత్న ఇవ్వాలి
- దేశంలో తయారయ్యే బల్క్‌డ్రగ్‌లో 35శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోంది
- జినోమ్ వ్యాలీ హైదరాబాద్‌కు చాలా కీలకం
- దాదాపు 66 దేశాల నుంచి వచ్చే రోగులకు వైద్య సేవలందించే స్థాయికి ఏఐజీ చేరుకోవడం మనందరికీ గర్వకారణం
- దేశంలో తయారయ్యే బల్క్‌డ్రగ్‌లో 35శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోంది



హైదరాబాద్

ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారం ఇచ్చి గౌరవిస్తుందని ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకోసం తెలంగాణ సీఎంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఏఐజీ ఆసుపత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి - మిగతా3లో





## తెలంగాణలో యూరియా కొరత

- కేంద్రం నుంచి రావాల్సిన వాటా రాకపోవడంతో కొరత నెలకొంది
- ఏప్రిల్, మే, జూన్ లో కేంద్రం నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 3 లక్షల మెట్రిక్ టన్నులు
- జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వాడకం ఉంటుంది
- తక్షణమే రాష్ట్రానికి కేటాయించిన యూరియాను పంపిణీ చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి

3



## హిమాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం సవతితల్లి ట్రీట్‌మెంట్

- ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల మంజూరులో కేంద్రం తాత్సారం చేస్తోంది
- భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో 2023లో హిమాచల్‌ప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లింది
- హిమాచల్‌ప్రదేశ్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ రూ.4,500 కోట్లు ఇచ్చింది
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే

2

## కోవిడ్19 వ్యాక్సిన్ వల్ల గుండెపోటు

- ఆకస్మిక మరణాలకు.. కొవిడ్ టీకాలకు సంబంధం లేదు..
- స్పష్టం చేసిన ఐసీఎంఆర్-ఎయిమ్స్ స్టడీ..!
- భారత వైద్య పరిశోధనా మండలి ఎయిమ్స్ సంయుక్తంగా అధ్యయనం
- కరోనా మహమ్మారి తర్వాత 40 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారిలో హార్ట్ ఎటాక్స్ పెరిగినట్లు నివేదికలు

2







## టెక్నికల్‌గా కాంగ్రెస్ సీఎం.. కానీ హృదయం ఇంకా టీడీపీలోనే ఉంది

- గోదావరి -బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు మరణ శాసనం కాబోతున్నది
- భయం లేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్లు ఉంది రేవంత్ తీరు
- బనకచర్ల మీద బొంకుడు రాజకీయాలు బంద్ పెట్టు
- బ్యాగులు మోసి బ్యాడ్ మెన్‌గా పేరు తెచ్చుకున్నడు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

3

# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

- సిగాచి యాజమాన్యం ప్రకటన
- ఈ ప్రమాదం జరిగిన మూడు రోజుల తర్వాత ఎట్టకేలకు కంపెనీ స్పందిస్తూ కీలక ప్రకటన
- సిగాచి ప్రమాదంపై స్టాక్ మార్కెట్లకు కంపెనీ సెక్రటరీ వివేక్ లేఖ
- పరిహారంతో పాటు అన్నిరకాల బీమా క్లెయిమ్స్‌ను చెల్లిస్తాం
- ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు
- ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం
- ప్రమాదం నేపథ్యంలో మూడు నెలల వరకు ప్లాంట్ పనులు నిలిపివేస్తాం



హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం జరిగిన మూడు రోజుల తర్వాత ఎట్టకేలకు కంపెనీ స్పందిస్తూ కీలక ప్రకటన చేసింది. సిగాచి ప్రమాదంపై స్టాక్ మార్కెట్లకు కంపెనీ సెక్రటరీ వివేక్ లేఖ రాశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. పరిహారంతో పాటు అన్నిరకాల బీమా క్లెయిమ్స్‌ను చెల్లిస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి పూర్తి వైద్య సాయం అందిస్తామని, కుటుంబపోషణను తామే చూసుకుంటామని సిగాచి సెక్రటరీ తెలిపారు. ప్రమాదంలో 40 మంది మృతి చెందారని, మరో 33 మందికి - మిగతా3లో



## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

- ఆడియో లీక్ వ్యవహారంలో.. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ కోర్టు ధిక్కరణ కింద ఆమెకు ఈ శిక్ష విధించిందని సమాచారం.
- గత ఏడాది అక్టోబర్‌లో షేక్ హసీనా.. రాజకీయ నాయకుడు షకీల్ అకాండ్ బుల్బుల్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్
- ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై

2

## మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్

- ఆ వస్తువులపై పన్ను తగ్గించే యోచనలో కేంద్రం..?
- నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచనలో కేంద్రం
- ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల భారం పడొచ్చని అంచనా.

2

## ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువ

- పాశమైలారం ఘటన.. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది
- మంత్రి దామోదర రాజనర్సింహ

పాశమైలారం

పాశమైలారంలోని పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకు 36 మంది మరణించారని.. ఇంకా 11 మంది కార్మికుల ఆచూకీ దొరకడం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేలుడు సంభవించిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువని పేర్కొన్నారు. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని - మిగతా3లో



# కోవిడ్19 వ్యాక్సిన్ వల్ల గుండెపోటు



**ముంబై :** కొన్నేళ్లుగా దేశంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు సంబంధించి ఉన్న భయాలకు సమాధానం దొరికింది. భారతదేశంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కరోనా వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదని తేలింది. ఐసీఎంఆర్, ఎయిమ్స్ లు చేసిన కొత్త అధ్యయనంలో ఈ విషయాన్ని తేల్చారు. నివేదిక ప్రకారం, గత నాలుగైదు ఏళ్లుగా ఆకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కారణం కోవిడ్19 వ్యాక్సిన్ కాదు. కానీ ఇప్పటికే ఉన్న అనారోగ్య సమస్యలు, వ్యాధులు, చెడు జీవనశైలి, వంశపారంపర్యంగా తలెత్తిన అనారోగ్య కారణాలు వల్ల మరణాలు సంభవిస్తున్నాయని ఐసీఎంఆర్, ఏయిమ్స్ అధ్యయనంలో తేలింది. ఎవరికైనా గుండె సంబంధిత సమస్యలు, షుగర్ లేదా అధిక రక్తపోటు వంటివి ఉంటే, జన్యుపరంగా సమస్యలు ఉన్నా.. వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది. కనుక దేశంలో ఇటీవల పెద్దలతో పాటు యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు కోవిడ్19 వ్యాక్సిన్‌తో సంబంధం లేదని స్పష్టం చేశారు. తాజాగా అధ్యయనం ప్రకారం కోవిడ్19 వ్యాక్సిన్ సురక్షితమైనదని. కనుక కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారు దీని గురించి భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. అధ్యయనంలో కరోనా వ్యాక్సిన్‌కు, అకస్మాత్తుగా సంభవించే మరణాలకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. చాలా సందర్భాల్లో గతంలో ఉన్న అనారోగ్య సమస్యలు, ఇప్పటికే ఉన్న వ్యాధులు, వంశపారంపర్య కారణాలు, అనారోగ్యకరమైన జీవనశైలి వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. అదే సమయంలో కోవిడ్19 వ్యాక్సిన్ల వల్ల కలిగే తీవ్రమైన దుష్ప్రభావం చూపడం చాలా అరుదు. ముఖ్యంగా 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిలో గుండెపోటుతో అకస్మాత్తుగా సంభవించిన మరణాలను పరిశోధించడానికి రెండు ముఖ్యమైన అధ్యయనాలు నిర్వహించారు. ఈ శాస్త్రీయ అధ్యయనాలలో యువత, మధ్య వయస్కులోనూ అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కోవిడ్ టీకాలు తీసుకోవడం కారణం కాదని తేలింది. గుండెపోటుతో పాటు చెడు జీవనశైలి, ఇప్పటికే ఉన్న వ్యాధులు, మనకు తెలియకుండా పెరిగిన అనారోగ్య సమస్యలు, వంశపారంపర్య సమస్యలు కారణాలు కారణమని పేర్కొన్నాయి. మే నుంచి ఆగస్టు 2023 మధ్య దేశంలోని 19 రాష్ట్రాల్లోని 47 పెద్ద ఆసుపత్రులలో ఐసీఎంఆర్ ఈ అధ్యయనం నిర్వహించింది. అక్టోబర్ 2021 నుండి మార్చి 2023 మధ్య పూర్తిగా ఆరోగ్యంగా కనిపించిన వ్యక్తులు అకస్మాత్తుగా మరణించిన కేసులను నిపుణులు పరిశీలించారు. ఈ మరణాలకు, కోవిడ్ వ్యాక్సిన్లు తీసుకోవడానికి ఎలాంటి సంబంధం లేదని నివేదిక స్పష్టం చేసింది. ఎయిమ్స్ ఢిల్లీ, ఐసీఎంఆర్ ల రెండో రీసెర్చ్ ఇంకా కొనసాగుతోంది. అకస్మాత్తుగా సంభవించే మరణాలకు గల కారణాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడం ఈ అధ్యయనం ముఖ్య లక్ష్యం. ప్రారంభ ఫలితాలలో గుండెపోటు (మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) సర్వసాధారణ కారణమని తేలింది. ఈ మరణాలకు వంశపారంపర్య కారణాలు సైతం కారణమని చాలా సందర్భాల్లో గుర్తించారు. ఇప్పటివరకు ఉన్న గణాంకాల ప్రకారం, గత కొన్నేళ్లతో పోల్చితే అకస్మాత్తుగా సంభవించే మరణాల సంఖ్యలో ఎటువంటి అసాధారణ పెరుగుదల కనిపించలేదు.

# నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి?



**బెంగళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం కొట్టిపారేశారు. ఐదేళ్లపాటు తానే సీఎంగా కొనసాగుతానని, అందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని మీడియాతో అన్నారాయన. అయితే కాసేపటికే ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. "నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి. ఆయనకు మద్దతుగా నిలవడం తప్ప.." అంటూ డీకేఎస్ బదులిచ్చారు. "నన్ను సీఎంగా చేయాలని నేను ఎవరినీ కోరలేదు. నాకు మద్దతుగా మాట్లాడమని ఎవరినీ పురమాయించలేదు. ఆ అవసరం కూడా నాకు లేదు. ఒకరు సీఎం ఉన్నప్పుడు.. ఇలాంటి ప్రకటనలు ఎందుకు?. పార్టీలో నాతో పాటు లక్షల మంది పని చేస్తున్నారు. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం" అని స్పష్టం చేశారాయన. అంతకుముందు.. సీఎం మార్పు ప్రచారంపై సీఎం సిద్ధరామయ్య కాస్త కటువుగానే స్పందించారు. యస్.. ఐదేళ్లు నేనే సీఎంగా కొనసాగుతా. అందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. మార్పు ఉందని చెప్పడానికి వాళ్లు(బీజేపీ, జేడీఎస్)ఏమైనా కాంగ్రెస్ అధిష్టానమా? అని మీడియాను ఎదురు ప్రశ్నించారాయన. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తర్వాత.. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా, డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అయితే అప్పట్లోనే ఇద్దరూ రెండున్నరేళ్ల చొప్పున పదవిని పంచుకుంటారని ప్రచారం జరిగింది. కానీ, ఆ ప్రచారాన్ని ఇద్దరూ తోసిపుచ్చారు. కట్ చేస్తే.. ఈ ఏడాది జూన్ 29వ తేదీన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్.. 2%-%3 నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు అని వ్యాఖ్యానించడంతో అసలు చర్చ మొదలైంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. ముఖ్యమంత్రి మార్పుపై నిర్ణయం హైకమాండ్ తీసుకుంటుంది అని బదులిచ్చారు. అయితే.. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ సెటైర్లు వేసింది. పార్టీ అధ్యక్షుడే హైకమాండ్ కాకపోతే మరెవరు?" అని ప్రశ్నించింది. మరోవైపు జేడీఎస్ కూడా ఈ వ్యవహారంలో కాంగ్రెస్‌ను ఎద్దేవా చేస్తూ సీఎం మార్పు తథ్యమన్నట్లు ప్రకటనలు ఇచ్చింది. ఈ తరుణంలో.. ఇటు సిద్ధరామయ్య, అటు శివకుమార్‌లు ఈ వ్యాఖ్యలను ఖండించారు.

**హుస్సేన్‌కు నోటీసులు ఇస్తాం: డీకేఎస్**

సీఎం మార్పు ప్రచారాన్ని ఖండించిన డీకే శివకుమార్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్‌కు నోటీసు ఇస్తాం. ఆయన వ్యాఖ్యలపై వివరణ కోరతాం. పార్టీ నియామావళికి అందరూ కట్టుబడి ఉండాలి.. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోకతప్పదు అని డీకే శివకుమార్ హెచ్చరించారు.

## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్షపడింది. కోర్టు ధిక్కరణ కేసులో బంగ్లా న్యాయస్థానం ఆమెకు ఈ శిక్ష విధించిందని బుధవారం(జులై 2న) అక్కడి మీడియా కథనాలు ఇస్తోంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే.. గత ఏడాది అక్టోబర్‌లో షేక్ హసీనా.. రాజకీయ నాయకుడు షకీల్ అకాండ్ బుల్బుల్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయ్యింది. అందులో న్యాయవ్యవస్థను బెదిరించేలా ఉన్న వ్యాఖ్యలపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. ఈ వ్యాఖ్యలకుగానూ హసీనాకు ఆరు నెలలు, షకీల్ బుల్బుల్‌కు 2 నెలల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ ఎం.డి. గోలం మోర్తుజా మొజుందర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పు ప్రకటించింది. ఇదిలా ఉంటే.. ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 30 శాతం కోటా కొనసాగించాలన్న ప్రభుత్వం నిర్ణయంపై నిరుద్యోగులు కిందటి ఏడాది జూన్‌లో ఆందోళన చేపట్టారు. హైకోర్టు ఈ కోటాను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో.. నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, నిరసనలు తగ్గలేదు. క్రమంగా ఆ ఆందోళన హింసాత్మకంగా మారింది. ఘర్షణల్లో 300 మందికి పైగా మరణించగా.. వేలాది మందికి గాయాలయ్యాయి. కర్ఫ్యూ, ఇంటర్నెట్ షట్‌డౌన్, సైన్యం మోహరింపు వంటి కఠిన చర్యలు తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు.. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలు ప్రధాని నివాసాన్ని తాకడంతో.. ఆమె అక్కడి నుంచి భారత్‌కు వచ్చేశారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఆమె రాజీనామా అనంతరం, తాత్కాలిక ప్రధానిగా నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు స్వీకరించారు.

## మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్



ఈ ఏడాది ఆరంభంలో ఆదాయపన్నులో రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని పలు వస్తువులను 5 శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌లు, సైకిళ్లు, రూ.1,000 కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ.1,000 మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది.

ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇటీవలే పరోక్షంగా సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల చివర్లో జీఎస్టీ సమావేశం జరగొచ్చని సదరు వర్గాలు సూచిస్తున్నాయి.

## డాక్టర్లు ఒక నెలరోజులు సామాజిక బాధ్యత

**ముంబై :** వైద్యులు ఏడాదిలో ఒక నెలరోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలని రేవంత్ రెడ్డి కోరారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందన్నారు. హైదరాబాద్ ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్ ను అందుబాటులోకి తెచ్చినం డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆయన హైదరాబాద్, తెలంగాణకు గొప్ప పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు.డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చింది. అయితే ఆయన భారతరత్నకు అర్హులు అని, ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి నా వంతు ప్రయత్నం చేస్తా అని సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు.ఏఐజీ ఆసుపత్రిలో 66 దేశాల నుంచి పేషంట్స్ ట్రీట్మెంట్ కు వస్తున్నారు.. ఇది గర్వకారణం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్ గా ఉంటుందని తెలిపారు.హైదరాబాద్ ను హెల్త్ టూరిజం హబ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నాం, అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందిసెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకి హెల్త్ ప్రొఫైల్ కార్డుని క్రియేట్ చేస్తాం. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయి. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ ఉంటున్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేసే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు.మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్ కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రపంచదేశాలతో పోటీ పడగలుగుతున్నామని తెలిసేలా చేశాం. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించాం. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో వెళ్తున్నామని తెలంగాణ సీఎం అన్నారు

## విద్యార్థినినీ ట్రాప్ చేసిన లేడీ టీచర్

**ముంబై :** ఒక స్టూడెంట్‌ను లేడీ టీచర్ ట్రాప్ చేసింది. అతడికి ఆందోళన తగ్గించే మందులు ఇచ్చి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడింది. విద్యార్థి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు అతడ్ని ఆరా తీయగా అసలు విషయం చెప్పాడు. దీంతో పేరెంట్స్ ఫిర్యాదుతో ఆ ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ప్రముఖ విద్యా సంస్థలో 40 ఏళ్ల లేడీ టీచర్ ఇంగ్లీష్ బోధిస్తున్నది. వివాహిత అయిన ఆ మహిళకు పిల్లలు కూడా ఉన్నారు.కాగా, 2023 డిసెంబర్‌లో స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా డ్యాన్స్ బృందంలో ఉన్న 11వ తరగతి చదువుతున్న 16 ఏళ్ల మగ విద్యార్థి పట్ల ఆ ఉపాధ్యాయురాలు ఆకర్షితురాలైంది. 2024 జనవరిలో లైంగిక సంజ్ఞలతో అతడ్ని కవ్వించింది. అయితే తొలుత ఆ విద్యార్థి ఆసక్తి చూపలేదు. ఆ లేడీ టీచర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో తన ఫ్రెండ్ సహాయాన్ని ఆమె కోరింది. ఆ విద్యార్థితో ఆమె మాట్లాడింది. మధ్యవయసు మహిళలు, టీనేజ్ అబ్బాయిల మధ్య సంబంధాలు చాలా సాధారణమని చెప్పింది. దీంతో లేడీ టీచర్‌ను కలిసేందుకు అతడు అంగీకరించాడు. మరోవైపు ఆ విద్యార్థిని ఉపాధ్యాయురాలు కారులో ఒకచోటకు తీసుకెళ్లింది. బలవంతంగా అతడి బట్టలు విప్పి లైంగికంగా వేధించింది. కొన్ని రోజులపాటు ఆ యువకుడు ఆందోళన చెందగా యాంటీ యాంగ్జైటీ మాత్రలు ఇచ్చింది. ఆ తర్వాత ఆ స్టూడెంట్‌ను ముంబైలోని ఫైవ్‌స్టార్ హోటల్స్, ఎయిర్‌పోర్ట్ సమీపంలోని స్టార్ హోటల్స్‌కు చాలాసార్లు కారులో తీసుకెళ్లింది. అతడికి మద్యం తాగించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడింది.కాగా, ఆ విద్యార్థిలో మార్పును అతడి పేరెంట్స్ గమనించారు. అతడ్ని నిలదీయగా లేడీ టీచర్‌తో ఉన్న రిలేషన్ గురించి చెప్పాడు. అయితే తమ కుమారుడి చదువు ప్రభావితం కాకుండా ఉండేందుకు కొంతకాలం వారు మౌనంగా ఉన్నారు. అతడ్ని కట్టడి చేశారు. 12వ తరగతి బోర్డు పరీక్షల తర్వాత ఆ విద్యార్థి ఆ స్కూల్ నుంచి వెళ్లిపోయాడు. అయితే తన పనిమనిషి ద్వారా అతడ్ని ఆ టీచర్ సంప్రదించింది. తనను కలవాలని చెప్పింది.మరోవైపు ఈ విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టంతోపాటు పిల్లల సంరక్షణ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు తర్వాత ఆ లేడీ టీచర్‌ను అరెస్ట్ చేశారు. ఆమె వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉపాధ్యాయురాలికి సహకరించిన ఆమె ఫ్రెండ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## హిమాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం సవతితల్లి ట్రీట్‌మెంట్



హిమాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం సవతితల్లి తల్లి ట్రీట్‌మెంట్ ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల మంజూరులో కేంద్రం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో 2023లో హిమాచల్‌ప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, దాంతో రూ.9000 కోట్ల నిధులు మంజూరు చేయాలని అక్కడి ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని ఖర్గే తెలిపారు. అయితే రెండేళ్లయినా పెండింగ్ నిధులు మంజూరు చేయకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని ఖర్గే విమర్శించారు. 2023లో హిమాచల్‌ప్రదేశ్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ రూ.4,500 కోట్లు ఇచ్చిందని, కేంద్రం కేవలం రూ.433 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. 2023 పెండింగ్ నిధుల పేరుతో కేంద్రం ఇప్పుడు రూ.2000 కోట్లు ప్రకటించి క్రెడిట్ మొత్తం తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పుడు కూడా భారీ వర్షాలు, వరదలతో హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం అవుతోంది. ఈ వర్షాలు, వరదలవల్ల ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఘటనల్లో అక్కడ 51 మంది మరణించారని, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

## 'సిక్కిం పొరుగు దేశమా?' బీజేపీ చురకతో కాంగ్రెస్ నేత క్షమాణలు



**న్యూఢిల్లీ:** కొందరు రాజకీయ నేతల ప్రసంగాల్లో అప్పుడప్పుడు తప్పులు దొర్లుతుంటాయి. దీంతో వారు అభాసుపాలవుతుంటారు. తాజాగా సిక్కింనకు చెందిన కాంగ్రెస్ నేత ఇదేవిధమైన వివాదంలో చిక్కుకున్నారు. తరువాత క్షమాపణలు చెప్పడంతో పాటు పొరపాటున నోరు జారానని వివరణ కూడా ఇచ్చారు. సిక్కిం కాంగ్రెస్ నేత అజోయ్ కుమార్ సిక్కింను పొరుగు దేశం అని పేర్కొన్న ఒక వీడియో వెలుగులో రావడంతో అతని మాటలు వివాదాస్పదంగా మారాయి. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. దీంతో అజోయ్ కుమార్ ఒక ప్రకటనలో తన నోరు జారడం వల్ల అలా జరిగిందంటూ క్షమాపణలు చెప్పారు. తాను విలేకరుల సమావేశంలో భారత్- పొరుగు దేశాల మధ్య క్షీణిస్తున్న సంబంధాల గురించి మాట్లాడుతూ, పొరపాటున సిక్కింను పొరుగు దేశంగా ప్రస్తావించాను. ఇది అనుకోకుండా జరిగిన మానవ తప్పిదమంటూ అజోయ్ కుమార్ తన తప్పుకు వివరణ ఇస్తూ క్షమాపణలు కోరారు. కాంగ్రెస్ నేత అజయ్‌కుమార్ తప్పుడు వ్యాఖ్యలను సిక్కిం బీజేపీ సిక్కిం యూనిట్ తీవ్రంగా ఖండించింది.. ఒక మాజీ ఐపీఎస్ అధికారి, పార్లమెంటు సభ్యుడైన అజయ్ కుమార్ భారతదేశ చరిత్ర భౌగోళిక స్వరూపంపై నిర్లక్ష్యం ప్రదర్శించడం విచారకరమని బీజేపీ 'ఎక్స్' పోస్టులో పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ఇటువంటి అవమానకరమైన తప్పులను నివారించేందుకు, వెంటనే పార్టీ నేతలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించింది. ఈ అంశంపై బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనవాలా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిన్నా అడుగుజాడలను అనుసరిస్తోందని, దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం



-మొదటిపేజీ తరువాయి

కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొంది స్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. "తెలంగాణ రాష్ట్రం హెల్త్ టూరిజం హబ్‌గా మారింది. దేశంలో తయారయ్యే బల్క్‌డ్రగ్‌లో 35శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోంది. జినోమ్ వ్యాలీ హైదరాబాద్‌కు చాలా కీలకం. దాదాపు 66 దేశాల నుంచి వచ్చే రోగులకు వైద్య సేవలందిం చే స్థాయికి ఏఐజీ చేరుకోవడం మనందరికీ గర్వకారణం. ఏఐజీ ఆసుపత్రి సేవలు ఇంకా విస్తరించాలి. హెల్త్ టూరిజంలో ప్రభుత్వానికి సహకరించాలని నాగేశ్వర్‌రెడ్డిని కోరాం. ఐడీపీఎల్ మాజీ ఉద్యోగుల కృషి వల్లే ఫార్మారంగం అభివృద్ధి చెందింది. క్యాన్సర్ చికిత్సలో నోరి దత్తాత్రేయ సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. క్యాన్సర్ వల్ల మహిళలే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. వారి ఆరోగ్య వివరాలు నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. జనని మిత్ర యాప్ పేదరోగులకు ఎంతో ఉపయోగపడుతుంది. నిమ్స్‌లో అదనపు బ్లాక్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్‌లో ఆసుపత్రులు నిర్మిస్తున్నాం. సామాజిక బాధ్యతగా.. ఏడాదిలో ఒక్క నెల రోజులు ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేయాలని ఈ రాష్ట్రంలో ఉన్న డాక్టర్లందరికీ విజ్ఞప్తి చేస్తున్నా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోశామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తైతే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళున్నామని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# టెక్నికల్‌గా కాంగ్రెస్ సీఎం.. కానీ హృదయం ఇంకా టీడీపీలోనే ఉంది

**హైదరాబాద్ :** రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి టెక్నికల్‌గా కాంగ్రెస్ సీఎం.. కానీ హృదయం ఇంకా తెలుగు దేశం పార్టీలోనే ఉందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బాసన్ల గురించి తెలిసినంత సులువు కాదు, బేసిన్ల గురించి తెలుసుకోవడం అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. భయం లేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్లు ఉంది రేవంత్ తీరు. బనకచర్ల మీద బొంకుడు రాజకీయాలు బంద్ పెట్టు. బ్యాగులు మోసి బ్యాడ్ మెన్‌గా పేరు తెచ్చుకున్నడు. బనకచర్ల కోసం బొంకు మెన్‌గా మారిండు. టెక్నికల్‌గా కాంగ్రెస్ ముఖ్యమంత్రివి కానీ, హృదయం ఇంకా తెలుగుదేశంలోనే ఉంది. స్కూల్ ఏజ్, కాలేజ్ ఏజ్‌లో ఉన్న చంద్రబాబుతో నీ అనుబంధం మరిచిపోవడం లేదు. జులై 6, 2024 నాడు ప్రజా భవన్‌కు చంద్రబాబును పిలిచి విభజన హామీల ముసుగులో గోదావరి బనకచర్ల మధ్య చీకటి ఒప్పందం జరిగింది. ప్రజాభవన్ వేదికగా తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం రాసిండు రేవంత్ రెడ్డి. సెప్టెంబర్ 13, 2024 నాడు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా విజయవాడలో చంద్రబాబును కలిసి బెజవాడ బజ్జీలు తిని బనకచర్లకు మద్దతు చెప్పి వచ్చిండు. ఈక్రమంలోనే.. నవంబర్ 15, 2024 నాడు ఏపీ–జీబీ లింక్‌కు సహకరించాలని నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు లేఖ రాశారు. ఆ తర్వాత వెంటనే డిసెంబర్ 31, 2024 నాడు నిర్మలకు మరో లేఖ. 80 వేల కోట్లు ప్రాజెక్టు కోసం ఆర్థిక సాయం అందించాలని చంద్రబాబు కోరారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గోదావరి నీళ్ల తరలింపు కుట్రలు జరుగుతుంటే తనకేం తెలియనట్లు మౌనంగా ఉన్నడు, నటించిండు రేవంత్ రెడ్డి? ఈ చీకటి అధ్యాయం బయటపడదు అనుకున్నడు. మాకు రేవంత్, బాబు కుట్రలు తెలియగానే నిలదీశాం. జనవరి 24, 2025 నాడు మొట్ట మొదట నేను తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్ పెట్టి అడిగిన. గడ్డి పీకుతున్నరా అని ప్రశ్నించిన. అప్పుడు నిద్ర లేచి జనవరి 22వ తేదీతో రాసినట్లు లేఖ సృష్టించి మీడియాకు విడుదల చేశారు. జూన్ 14, 2025 నాడు నేను పీపీటీ పెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అదే రోజు పాత డేట్ వేసి లెటర్ విడుదల చేశారు. అసలు గోదావరి బనకచర్ల మీద పోరాడింది బిఆర్ఎస్, కుట్రు కాల్చి వాత పెట్టింది బిఆర్ఎస్ అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అపెక్స్ కమిటీ మీటింగ్‌లో బనకచర్ల అనే పదం ఉందా..? రేవంత్ రెడ్డి ఎందుకు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నవు. ఒక్క పేరా చదివి ఎజెండా 5లో చెప్పిన అంశాలను ఎందుకు చదవలేదు. వరద జలాల వినియోగంలో రెండు రాష్ట్రాలు ఉపయోగపడే విధంగా, ఆమోదయోగ్యంగా వాడుకునేందుకు సంప్రదింపులు చేసుకోవాలని ఉంది. అంతే గాని అందులో బనకచర్ల అని ఉందా, నీళ్ళు తరలించుకుపో అని ఉందా.. ఎందుకు ఇంత చిల్లరగా మాట్లాడుతున్నావు రేవంత్ రెడ్డి. చంద్రబాబు ముందుకు రాలేదు, జగన్ ముందుకు రాలేదు, అది ముందుకు పడలేదు. ఇప్పుడు ముందుకు ఎలా పోతున్నది. బాబును ప్రజా భవన్ పిలిచిండు, ఉత్తమ్ బెజవాడ పోయి బజ్జీలు తిని అమోదం తెలిపిండు. ఎజెండా 5లో తెలంగాణ అనుమతి లేకుండా నీళ్ల డైవర్షన్‌కు ఒప్పుకునేది లేదని చెప్పిండు కేసీఆర్. నువ్వు రాసిన పీపీటీలోనే బనకచర్ల అనేది లేదు. నువ్వు హెడ్డింగ్ కావాలని 2016 గోదావరి పెన్నా అనుసంధానం అని పెట్టినవు. ఇంత చిల్లరగా, ఇంత చిచోరగా ఉన్నవు. దమ్ముంటే అసెంబ్లీ పెట్టు వాస్తవాలు బట్టబయలు చేస్తం. మైక్ కట్ చేయకు, కెమెరా తిప్పకు అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సవాల్ విసిరారు.

**గోదావరి –బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు మరణ శాసనం కాబోతున్నది**

గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు మరణ శాసనం కాబోతుంది అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి పేరుతో నాగార్జున సాగర్ కుడి కాలువను డబుల్ చేసి రోజుకి రెండు టీఎంసీల కృష్ణా జలాలను తరలించే కుట్ర జరుగుతుంది. మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా నిజాయితీగా పోరాడు.. తెలంగాణకు అన్యాయం చేయకు అని హరీశ్‌రావు హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ మొత్తం నీళ్ళు వదిలేసిండు అంటడు రేవంత్ రెడ్డి.. 2.10.2020 నాడు కేసీఆర్.. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. అందులో ఏముంది 3000 టీఎంసీల మిగులు జలాలు సగటున ఉంటున్నాయి. ప్రస్తుతం ఉన్న 968 కాక, ఈ మూడు వేలలో వాటా కావాలని, మొత్తం 2918 టిఎంసీలు తెలంగాణ హక్కు అని స్పష్టంగా కేసీఆర్ రాశారు. గోదావరిలో వెయ్యి, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి ఏమైనా చేసుకో అన్నడు మొన్న. నువ్వెవడివి తెలంగాణ హక్కులు వదిలి పెట్టడానికి అంటే నిన్న రేవంత్ రెడ్డి మాట మార్చిండు. వరద జలాల్లోనూ వాటా కావాలని నిన్న అంటున్నడు. 3000 టీఎంసీలు అనేది ఓసారి బ్రహ్మ పదార్థం అంటడు, రాచపుండు అంటడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. సముద్రంలో కలిసే జలాలు 58 ఏండ్ల సగటు 3వేల టీఎంసీల దాకా ఉంది. ఇది తెల్వక రేవంత్ రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నడు. నదీ మార్గంలో నీళ్లు తేవాలని ఆనాడు కేసీఆర్, జగన్‌తో అన్నారు. అది కాదని భూభాగంలో నీళ్లు తరలించే ప్రయత్నం మొదలు పెట్టారు. కేసీఆర్ ఆదేశాల మేరకు 2022లో నేను ఢిల్లీ వెళ్లి షెకావత్‌కి లేఖ అందించాను. గోదావరి పెన్నా లింక్ అడ్డుకోవాలని కోరాను. గోదావరి బనకచర్ల ప్రాజెక్టులో కృష్ణా నీళ్ల మళ్లింపు కూడా ఉంది. డీపీఆర్‌లో క్లియర్‌గా పేర్కొన్నారు. రెండు నదుల నీళ్లు కొల్లగొడుతామని చెప్పారు. నాగార్జునసాగర్ కుడి కాల్వను డబుల్ చేసి, రోజుకు 2 టిఎంసీల చొప్పున వరద జలాల పేరిట బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తామంటున్నరు. ఒకవైపు గోదావరి, మరోవైపు కృష్ణా నీళ్ల తరలింపు కోసమే గోదావరి బనకచర్ల ప్రాజెక్టు. ఏ విధంగా చూసినా గోదావరి బనకచర్ల తెలంగాణకు మరణ శాసనం కాబోతున్నది. నువ్వు అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ తెలంగాణ ద్రోహివే. నీళ్లు ఏపీకి దారాదత్తం చేసి తెలంగాణ ద్రోహిగా మిగిలిపోకు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.


**299 : 512 టీఎంసీల ద్రోహం కాంగ్రెస్ పార్టీదే.. బీఆర్ఎస్ ఒప్పుకున్నదంటే నాలుక చీరేస్తాం**

కృష్ణా నదిలో నీటి వాటాపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అబద్దపు ప్రచారంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కృష్ణాలో 299:512 టీఎంసీల ద్రోహం కాంగ్రెస్ పార్టీదే అని ధ్వజమెత్తారు. 299 టీఎంసీలకు బీఆర్ఎస్ ఒప్పుకున్నది అని ఎవరైనా అంటే నాలుక చీరేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ ఈ రేవంత్ రెడ్డి. అబద్దాల వైరస్‌కు విరుగుడు బీఆర్ఎస్ అనే టీకా ఉందన్నారు హరీశ్‌రావు. బయట వాళ్లకు సద్దులు కడుతూ ఇంటి మనిషిపై నిందలు వేస్తున్నడు రేవంత్ రెడ్డి. తెలంగాణ సాధించింది కేసీఆర్, సెక్షన్ 3 సాధించి కృష్ణాలో నీటి వాటా సాధించేందుకు కృషి చేశారు కేసీఆర్. 299:512 హక్కుల విషయంలో కేసీఆర్, హరీశ్ రావు సంతకం పెట్టిండు అని చూపిస్తవా, నేను పదవికి రాజీనామా చేస్తా అని సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్ విసిరారు. గోదావరిలో 968 టీఎంసీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అయితే, కృష్ణాలో 299:512 ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదే కదా..? 2013 నవంబర్ 18న నాడు ఉమ్మడి ఏపీ జస్టిస్ శ్రీ కృష్ణ కమిటికి రిపోర్టు ఇచ్చింది. ఇదే రిపోర్టును శాసనసభలోనూ పెట్టారు. తెలంగాణకు కృష్ణాలో 299, ఏపీకి 512 ఇచ్చినం అని ఉంటుంది. ఎవరు మరణ శాసనం రాశారు తెలంగాణ నీటి హక్కులకు. మీ చేతగాని తనం, అడుగులకు మడుగులొత్తడం వల్ల 299 వాటా పరిమితం అయ్యింది. అన్ని డ్యాక్యుమెంట్లు విడుదల చేసేందుకు నేను సిద్దం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కులు కాపాడంలో మీడియా క్రియాశీలక పాత్ర పోషించాలని చేతులెత్తి మొక్కుతున్నా. అడ్ హక్‌కు, ఫైనల్ అవార్డుకు తేడా తెలియని అజ్ఞాని రేవంత్ రెడ్డి. 2015 జున్ 26లో చేసుకున్న అగ్రిమెంట్ తాత్కాలిక ఒప్పందం అని లేఖలో ఉంటుంది. మీ ముద్దుల అడ్వైజర్ ఆదిత్యానాథ్ సంతకం పెట్టిండు. ఆయనే ఇప్పుడు నీ అడ్వైజర్. తెలంగాణ హక్కులకు ఆనాడు వ్యతిరేకంగా మాట్లాడిండు. తెలంగాణ హక్కులను కాలరాసిన వ్యక్తిని సలహాదారుడిగా పెట్టుకున్నవు. బాబు చెప్పు చేతుల్లో ఉన్నవా, తెలంగాణకు పని చేస్తున్నవా. గురుదక్షిణ చెల్లించాలనే తపనే తప్ప నీకు తెలంగాణ నీటి ప్రయోజనాలు పట్టవు. కేఆర్ఎంబికి ప్రాజెక్టులు అప్పగించాలని జోషి అంటే, లేదు లేదు అప్పగించాలని చెప్పిన వ్యక్తి ఆదిత్యా నాథ్ దాస్. అలాంటి వ్యక్తిని సలహాదారుడిగా పెట్టుకున్నడు. ఈ తాత్కాలిక ఒప్పందంపై సంతకం ఎవరు పెట్టారు మీ సలహాదారుడు.

**కానీ రేవంత్ రెడ్డి నేను పెట్టిన, కేసీఆర్ పెట్టిండు అంటుండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.**

జులై 14, 2014 నాడు కృష్ణాలో 299 అన్యాయం అని కేంద్రానికి లేఖ రాసినం. రాష్ట్రం వచ్చిన 42 రోజుల్లోనే ఆనాటి కాంగ్రెస్ మాకు అన్యాయం చేసింది, కొత్త ట్రిబ్యునల్ వేసి నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా కేంద్రాన్ని కోరినం. తెలంగాణ పట్ల మా చిత్తశుద్ధికి, నిజాయితీకి నిదర్శనం ఇది. 299 కాక, 581 టీఎంసీలు మాకు కావాలని, ఈ లెక్కంత తేలాలంటే ట్రిబ్యునల్ వేసి పంచాలని 22 పేజీల లేఖ రాసినం. 299ని మేం ఒప్పుకోలేదు. ఇది కాంగ్రెస్ పార్టీ రాసిన మరణ శాసనం. తాత్కాలిక ఒప్పందాన్ని చూపి శాశ్వత ఒప్పందం అని అబద్దాలు చెబుతున్నడు రేవంత్ రెడ్డి. 299 లెక్కకు ద్రోహి ఆదిత్యానాథ్ దాస్, అయన పెట్టిందే ఈ రాచపుండు. ట్రిబ్యునల్ వేయడంలో ఆలస్యం అవుతుందని మొదటి అపెక్స్ కౌన్సిల్ 2016లో చెప్పినం. రెండో అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లో అడిగితే షెకావత్ సుప్రీం కోర్టులో కేసు వాపస్ తీసుకోవాలని చెప్పిండు. అప్పుడు కేసు విత్ డ్రా చేసుకొని, సెక్షన్ 3ని సాధించింది బిఆర్ఎస్. 299 శాశ్వత ఒప్పందం మేము చేసుకుంటే, సెక్షన్ 3 ఎందుకు అడిగాము, అపెక్స్ కౌన్సిల్ ఎందుకు పోయాము, ఎందుకు సుప్రీంకు పోయాము. సెక్షన్ 3పై తెలంగాణ వాదనలు ముగింపు దశలో ఉన్నాయి. 2025లో ఈ ఏడాది 763 టీఎంసీలు మనకు వచ్చే అవకాశం ఉంది. ఈ అమాయక చక్రవర్తి 500 టిఎంసీలు చాలు అని అన్నడని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## తెలంగాణలో యూరియా కొరత





**హైదరాబాద్:** రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడింది. కేంద్రం నుంచి రావాల్సిన వాటా రాకపోవడంతో కొరత నెలకొంది. 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉన్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబుతున్నారు. ఏప్రిల్, మే, జూన్ లో కేంద్రం నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 3 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చినట్లు పేర్కొన్న మంత్రి.. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వాడకం ఉంటుందని తెలిపారు. కేంద్ర మంత్రులు ప్రకాష్ నడ్డా, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. నెలవారిగా కేటాయించిన విధంగా రాష్ట్రానికి యూరియా పంపిణీ చేయాలని.. యూరియా లోటు వలన రైతులు రానున్ననెలలో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. తక్షణమే రాష్ట్రానికి కేటాయించిన యూరియాను పంపిణీ చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

## మృతుల కుటుంబాలకు కోటి పరిహారం..

-మొదటిపేజీ తరువాయి

గాయాలు అయినట్లు చెప్పారు. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ప్రమాదం నేపథ్యంలో మూడు నెలల వరకు ప్లాంట్ పనులు నిలిపివేస్తామని సిగాచి యాజమాన్యం ప్రకటించింది. కాగా.. నిన్న (మంగళవారం) పాశమైలారంలో ప్రమాద స్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిగాచి కంపెనీపై కఠిన చర్యలు తీసుకుంటామని, మానవీయకోణంలో చనిపోయిన వారి కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కోటి రూపాయలను కంపెనీ ద్వారా బాధితులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే 48 గంటలు గడిచినప్పటికీ కంపెనీ ఎండీ ఘటనా స్థలికి రాకపోవడంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో ఈరోజు సిగాచి కంపెనీ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వడంతో పాటు క్షతగాత్రులకు వైద్య ఖర్చులను తామే భరిస్తామని సిగాచి యాజమాన్యం పేర్కొంది.

## ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువ



-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. సిగాచీ కంపెనీ యాజమాన్యం ప్రమాద స్థలికి వచ్చిందని.. వారితో చర్చించినట్లు దామోదర రాజనర్సింహ తెలిపారు. సిగాచీ పరిశ్రమను మంత్రితో పాటు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత జగ్గారెడ్డి తదితరులు పరిశీలించారు. విపత్తు నిర్వహణ సిబ్బందిని అడిగి ప్రమాదం తెలుసుకున్నారు. బాధితుల బంధువులను పరామర్శించి అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. కాగా, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో విషాదం నింపింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద ప్రమాదం. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ కార్మికులు, సిబ్బంది మృతదేహాలు వెలికి వస్తూనే ఉన్నాయి. ప్రమాదంలో 36 మంది మరణించినట్టు మంగళవారం సాయంత్రం అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు 14 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారిని గుర్తించాల్సి ఉన్నది.

## యాజమాన్యం తప్పుంటే కఠిన చర్యలు తీసుకోవాలి : అసదుద్దీన్ ఒవైసీ



సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు మరణించిన ఘటనపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అదొక దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ ఘటనలో 38 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది బాధాకరమైన ఘటన అని అన్నారు. మృతుల్లో ఎక్కువగా జార?ండ్‌కు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గుర్తించలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్‌ఏ పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన తర్వాతనైనా ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. ఈ ప్రమాదంలో సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాగా సిగాచీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిపేయి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.

## సంపాదకీయం

# రహదారి భద్రతకు 'ఎఐ' సాయం

దేశంలో రోడ్డు ప్రమాదాలు రానురాను విపరీతంగా పెరుగుతున్నాయి. 2023 లో దాదాపు 1.73 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా, 2024లో 4.8 లక్షల మంది కన్నా ఎక్కువ మంది చనిపోయారు. అంటే 2023 కన్నా 4.2 శాతం ఎక్కువ. ప్రతి మూడు నిమిషాలకు ఒకరు వంతున రోజుకు 474 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితుల్లో ఐదో వంతు మంది పాదచారులు కాగా, టూవీలర్లు నడిపేవారు, ముఖ్యంగా హెల్మెట్ ధరించని వారు 44 శాతం వరకు ఉన్నారు. ఎక్కువగా మనుషులను చంపుతున్నది ఓవర్ స్పీడే. మరణాల్లో రెండింట మూడొంతులు ఓవర్‌స్పీడ్ వల్లనే జరుగుతున్నాయి. ఇది మేలుకోవలసిన హెచ్చరిక. ఈ ధోరణిని అరికట్టడానికి కృత్రిమ మేధ (ఎఐ) వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలు ఉపయోగపడతాయని అధ్యయనాల్లో తేలింది. పుణె వంటి నగరాల్లో ప్రజా రవాణా వ్యవస్థలు స్మార్ట్ కెమెరాలను వినియోగించడం ప్రారంభించాయి. డ్రైవర్లు మగతగా ఉన్నారా? పరధ్యానంలో ఉన్నారా? సిగ్నల్స్‌ను దాటుకుని స్పీడ్‌గా వెళ్తున్నారా? ఇలాంటి అపసవ్య విధానాలను ఈ స్మార్ట్ కెమెరాలు పట్టేస్తాయి. కెమెరాల నుంచి, స్టీరింగ్ నమూనాల నుంచి బ్రేకుల ఒత్తిడినుంచి డేటా సేకరిస్తారు. అలాగే డ్రైవర్ ఎన్నిసార్లు కనురెప్పలు మూస్తూ తెరుస్తూ ఉన్నాడో, తరచుగా వాహనం ఎన్నిసార్లు అదుపు తప్పిందో, రెడ్‌లైట్ సిగ్నల్ వద్ద డ్రైవర్ ఎలా ప్రమాదకరంగా ప్రవరిస్తున్నాడో తెలిసిపోతుంది. అలాంటి సమయాల్లో హెచ్చరికలు వస్తాయి. కొన్ని సార్లు కీచుమని శబ్దం రూపంలోనూ, మరికొన్ని సార్లు స్టీరింగ్ వీల్ ప్రకంపించడం ద్వారాను హెచ్చరికలు వస్తుంటాయి. డ్రైవర్ల జీవితం ఎక్కువగా రోడ్లపైనే సాగుతుంది. ఎఐ వ్యవస్థ డ్రైవింగ్ అవర్స్‌ను ట్రాక్ చేయడమే కాదు, వారు స్మార్ట్‌గా డ్రైవ్ చేయడానికి సహాయపడుతుంది. ఎప్పుడు కళ్లు మత్తుతో పడినా లేదా సిగ్నల్స్‌కు స్పందించే సమయం జారిపోయినా విపత్తును పసిగట్టి తక్షణం విశ్రాంతి తీసుకోవాలని డ్రైవర్‌లకు హెచ్చరిస్తుంది. ఓవర్ స్పీడ్‌తో వాహనం వెళు న్నప్పుడు స్వయం చాలకంగా నియంత్రించడం, ముందున్న వాహనానికి ఈ వాహనానికి మధ్య దూరాన్ని గమనించి అవసరాన్ని బట్టి వేగాన్ని తగ్గించడం లేదా పెంచడం చేస్తుంది. డ్రైవర్లు ఒత్తిడికి గురికాకుండా సౌకర్యవంతంగా ఉండే వరకు ఏకాగ్రతను పెంచుతుంది. అయితే ఇక్కడ కీలకమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎఐ ఆధారిత డ్రైవింగ్ వ్యవస్థ విఫలమైతే ఎవరు బాధ్యత వహిస్తారు? డ్రైవర్లా లేక సాంకేతిక గణాంకాలా? ఈ ఆటోమేషన్‌పై ఆధారపడడం పెరిగితే డ్రైవర్లకు అవగాహన, సహజమైన ప్రతిస్పందన సామర్థం తగ్గిపోతాయా? ఇవన్నీ ముమ్ముందు జాగ్రత్తగా క్రమాంకనం చేయవలసి ఉంది. కృత్రిమ మేధ వ్యవస్థలకు వాతావరణ మార్పులు, నిలకడ లేని మానవ ప్రవర్తన, అస్థిరమైన మౌలిక సదుపాయాలు వంటి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. వీటి నమూనాలు నియంత్రిత అమరికల్లో బాగానే పనిచేస్తాయి. కానీ అస్తవ్యస్తమైన ట్రాఫిక్ జామ్‌లోకి ప్రవేశించినా లేదా గ్రామీణ రహదారుల్లో వెలుతురు సరిగ్గా లేకపోయినా వాటి పనితీరు సరిగ్గా ఉండదు. అమెరికా, జర్మనీ వంటి దేశాల్లో ఎఐ డేటా ఆధారిత పర్యవేక్షక వ్యవస్థలను ప్రయోగాత్మకంగా వాణిజ్య నౌకల్లో వినియోగించగా, నౌకలు ఢీకొనే ప్రమాదాలు 30 శాతం వరకు తగ్గాయని తేలింది. అదే విధంగా భారత దేశంలో బస్సుల్లో డ్రైవర్లకు సహాయక హెచ్చరికల పైలట్ ప్రణాళికలను కొన్ని చోట్ల అమలు చేయగా, ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని తేలింది. రవాణా వ్యవస్థలో కృత్రిమ మేధ సహాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఏమంత కష్టం కాదు. ఇదిలా ఉండగా కృత్రిమమేధ సాయంతో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఢిల్లీ గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తీసుకు రావడం చెప్పుకోదగిన విశేషం. దీంతో దేశంలోనే మొట్టమొదటి ఎఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపుపొందింది. ట్రాఫిక్‌ను పర్యవేక్షించడం, ప్రమాదాలను గుర్తించి హెచ్చరించడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం. ఈ రహదారిపై సీటు బెల్టు ధరించకుండా ప్రయాణిస్తే అత్యాధునిక కెమెరాలు టక్కున పట్టేస్తాయి. ఒకే టూవీలర్‌పై ముగ్గురు ప్రయాణించడం, ఓవర్ స్పీడ్ తదితర 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఈ ఎటిఎంఎస్ వ్యవస్థ పట్టుకుంటుంది. దీనికి ఎన్ఐసి ఇ చలానా పోర్టల్‌ను కూడా అనుసంధానం చేశారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం వెంటనే అందుతుంది. ఈ ఎటిఎంఎస్‌లో ఐదు రకాల వ్యవస్థలు ఉంటాయి. ట్రాఫిక్ మోనిటరింగ్, ప్రమాదాల వీడియో చిత్రీకరణ, వాహన వేగం, వివిధ సందేశాలతో కూడిన సైన్‌బోర్డులు, సెంట్రల్ కంట్రోల్ రూమ్ వంటివి ఇందులో ఇమిడి ఉంటాయి. ఇందులోని కమాండ్ సెంటర్ అనేది డిజిటల్ బ్రెయిన్‌గా వ్యవహరిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్థానిక , జాతీయ రహదారి సిబ్బందికి సమాచారం అందిస్తుంది. దట్టమైన పొగమంచు ఏర్పడినా, రహదారిపై అడ్డంకులు ఉన్నా, రహదారుల్లోకి జంతువులు ప్రవేశించి స్వైరవిహారం చేసినా, సంబంధిత సిబ్బందిని ఈ వ్యవస్థ అప్రమత్తం చేస్తుంది. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై అమలు చేయడానికి కేంద్రం యోచిస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే రహదారులపై ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. అలాగే రహదార్లు ఆధునిక సాంకేతికతను సంతరించుకుంటాయి.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు



తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవర సాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాల లో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతననం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్‌పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750 పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు.నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు.ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరుపెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాళా బిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళు ళ్ళ పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యుముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.

# 63 వసంతాల చిత్రరాజం



తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసి, నాటి, నేటి తరాల సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూరగొన్న అలనాటి చిత్ర రాజం గుండమ్మ కథ. తెలుగు చిత్ర సీమలో క్షణం తీరిక దొరకని అగ్రశ్రేణి నటులతో నిర్మించిన మల్టీ స్టారర్ సినిమా అది. 1962 జూన్ 7న విడుదలై 63 వసంతాలు పూర్తి చేసుకున్న ఆ చిత్రం నిర్మాణం వెనక విశేషాలు ఎన్నో... ఎన్నెన్నో... ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి హీరోలు ఉన్నా, "గుండమ్మ కథ" అని సూర్యకాంతం పాత్ర పేరుమీద సినిమా పేరు పెట్టడమే గొప్ప వైవిద్యం. జానపద బ్రహ్మగా పేరొందిన విఠలాచార్య కన్నడంలో "మనె తుంబిద హెణ్ణు" పేరిట కుటుంబ కథాచిత్రాన్ని ముందుగా తీశారు. నిర్మాత అయిన విఠలాచార్య, చిత్ర నిర్మాణానికి వాహినీ స్టూడియోస్ అధినేత బి.నాగిరెడ్డి సహకారం తీసుకున్నారు. ఆ కృతజ్ఞతతో నాగిరెడ్డి అడగగానే సినిమా హక్కులను విఠలాచార్య ఆయనకి ఇచ్చేశా రు.. అయితే ఇందులో గుండమ్మ కుటుంబ వ్యవహారాలు నాటకీయంగా సాగుతూ, నాగిరెడ్డికి తమాషాగా అనిపించాయి. దాంతో విజయా ప్రొడక్షన్స్ చరిత్రలోనే "తొలిసారి ఓ రీమేక్" చేసేందుకు సిద్ధపడ్డారు. కథలో చిన్న చిన్న మార్పులు చేసి డి.వి.నరసరాజుతో ట్రీట్మెంట్, మాటలు రాయించారు నాగిరెడ్డి. సినిమాకు దర్శకునిగా నాగిరెడ్డి సోదరుడు బి.ఎన్.రెడ్డిని అనుకున్నారు. అయితే బి.ఎన్.రెడ్డి కళాత్మక చిత్రాల తరహా దర్శకుడు కావడమూ, ఇది ఆయన తరహా సినిమా కాకపోవడంతో పాటు బి.ఎన్.రెడ్డి లాంటి అగ్ర దర్శకుడు ఓ రీమేక్ సినిమా చేస్తే బాగుండ దన్న ఆలోచనతో, నాగిరెడ్డే ఇతర దర్శకునితో చేద్దామని నిర్ణయించు కున్నారు. పి.పుల్లయ్య దర్శకత్వం వహిస్తే బావుంటుందని, ఆయనకు నరసరాజు సిద్ధం చేసిన డైలాగ్ వెర్షన్ పంపారు. అది చదివిన పుల్లయ్య ఈ కథ, ట్రీట్మెంట్ నాకు నచ్చలేదు అని ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దాంతో సినిమా నిర్మాణం మళ్ళీ వెనుక బడింది. ఈ స్క్రిప్ట్ తన సన్నిహితుడు, సహ నిర్మాత, రచయిత అయిన చక్రపాణికి ఇచ్చారు నాగిరెడ్డి. అయితే చక్రపాణికి గుండమ్మ కుటుంబ వ్యవహారాలు, ఆ పాత్రలు బాగా నచ్చిన నాగిరెడ్డి మాత్రం ఎలాగైనా సినిమా తీయాల్సిందేనన్న పట్టుదలతో ఉండిరి. ఇక చక్రపాణి మొత్తం స్క్రిప్టును తిరగరాసే పనిలో, "విలియం షేక్స్పియర్ రాసిన ద టేమింగ్ ఆఫ ద ష్రూ" నాటకంలో కథానాయికల పాత్రలను, వారి స్వభావాలను ఆధారం చేసుకుని కథను తిరగ రాశారు.సినిమాకు దర్శకునిగా చివరకు కమలాకర కామేశ్వరరావుని ఎంచుకున్నారు నాగిరెడ్డి. తర్వాత చక్రపాణి తిరగ రాసిన కథకు ట్రీట్మెంట్, సీనిక్ ఆర్డర్ కోసం చక్రపాణితో, కమలాకర కామేశ్వరరావు, డి.వి.నరసరాజు కథా పర చర్చలు జరిపారు. ఆ చర్చల్లో భాగంగా అప్పటివరకూ ఉన్న గుండమ్మ భర్త పాత్రను తొలగించి, గుండమ్మను వితంతువుగా చూపిద్దామని చక్రపాణి నిర్ణయించారు. మిగతా గుండమ్మ కుటుంబాన్నంతా యధాతథంగా వాడుకున్నారు. సినిమా అనుకున్ననాడే గుండమ్మ పాత్రకు సూర్యకాంతం అయితేనే సరిపోతారని భావించారు. గుండమ్మ నిజానికి తెలుగుపేరు కాదు కన్నడ పేరు. కన్నడంలోని ఈ సినిమా మాతృకలో ఓ పాత్ర పేరు గుండమ్మ. కథను తిరగరాసే క్రమంలో ఆ గుండమ్మ పాత్రను ప్రధానపాత్రగా చేసుకుని, అదే పేరు పెట్టాలని నిర్ణయించారు చక్రపాణి. , "ఇందులో ఏముంది, పెడితే అదే తెలుగు పేరు అవుతుంది" అని గుండమ్మ అన్న పేరే ఖాయం చేశారు. సినిమాలో నటించిన ఇద్దరు కథానాయకులు ఎన్టీఆర్, ఏఎన్నార్ అప్పటికే తెలుగు సినిమా పరిశ్రమలో టాప్ హీరోలు. సినిమా విడుదల సమయంలో టైటిల్స్ లో ఎవరి పేరు ముందు వేయాలి, ఎవరిది తర్వాత వేయాలి వంటి సందేహాలు వచ్చాయి. అయితే పరిష్కార మార్గంగా అసలు తెరపై పేర్లే వేయకుండా ఫోటోలు చూపించాలని నిర్ణయించు కున్నారు. మొదట ఎన్టీ రామారావు, నాగేశ్వరరావు, సావిత్రి, జమున, ఎస్వీ రంగారావుల ఫోటోలు ఒకేసారి తెరపై వేసి, తర్వాత ఒకేసారి సూర్యకాంతం, ఛాయాదేవి, రమణారెడ్డి, హరనాథ్, ఎల్.విజయలక్ష్మిల ఫోటోలు వేశారు. సినిమాలో ముఖ్యపాత్రలు వేసిన ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, ఎస్.వి. రంగారావు, సూర్యకాంతం తదితరులు పరిశ్రమలో చాలా బిజీ ఆర్టిస్టులు. వీళ్ళందరిపై ఒకేసారి షూటింగ్ చేయాలంటే వాళ్ళ డేట్స్ కలిసేవి కాదు. విజయా వారికి చెందిన వాహినీ స్టూడియోలో గుండమ్మ ఇంటి సెట్ వేసి ఉంచారు. రోజూ ఉదయం చక్రపాణి ఆఫీసుకు వెళ్లి, రామారావు, సావిత్రి, నాగేశ్వరరావు, ఎస్వీఆర్ మొదలైన నటులకు ఫోన్ చేసేవారు. ఫోన్లో ఆరోజు వాళ్ళ షెడ్యూల్ ఏమిటో కనుక్కునే వారు. వచ్చిన వాళ్ళలో స్క్రిప్ట్ ని బట్టి వాళ్ళ మధ్య కాంబినేషన్ సీన్లు చూసుకుని షూటింగ్ చేసేవారు. సినిమాలో "కోలో కోలోయన్న" పాట ఎన్టీఆర్ – సావిత్రి, ఏఎన్నార్ – జమున జంటలు పక్కపక్కనే ఉండి పాడుకుంటున్నట్టు చూపించారు. కానీ నలుగురు ఒకేసారి కలిసి చేయనే లేదు. ఎవరికి ఎప్పుడు ఖాళీవుంటే వారితో అప్పుడు పాటను తీసేశారు. ఎడిటింగ్ లో ఆ తేడాలు తెలియ కుండా బహు జాగ్రత్తపడ్డారు.సినిమా విడుదలకు ఇంకా పదిరోజుల సమయం ఉందనగానే, ఎల్వీ ప్రసాద్ ఇంట్లో జరిగిన పెళ్ళి వేడుకల్లో గుండమ్మ కథ సినిమాను ప్రదర్శించగా సినీ రంగ ప్రముఖులు పలువురు విమర్శనాస్త్రాలు సంధించారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమున, ఎస్.వి.రంగారావు, సూర్యకాంతం, ఛాయాదేవి , రమణారెడ్డి , హేమలత , హరనాథ్ , ఎల్ విజయలక్ష్మి , ముక్కామల, ఋష్యేంద్ర మణి, రాజనాల తదితర అగ్ర నేతల మేలు కలయిక కూర్పుతో, గుండమ్మకథ సినిమా జూన్ 7, 1962న రాష్ట్ర వ్యాప్తంగా విడుదలై హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడిచి సదరు విమర్శలను త్రిప్పి కొట్టి, రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.ఎంత హాయి ఈ రేయి, ఎంత మధుర మీ హాయిబీ కోలోకోలో యన్నకోలో నాసామి కోమ్మలిద్దరు మాంచిజోడుబీ ప్రేమయాత్రలకు బృందావనము నందనవనము ఏలనోబీ మౌనముగా నీ మనసు పాడిన వేణుగానమును వింటిలేబీ లేచింది నిద్ర లేచింది మహిళాలోకం దద్దరిల్లింది పురుష ప్రపంచంబీ వేషము మార్చెనూ భాషను మార్చెను మోసము నేర్చెను అసలు తానే మారెనుబీ సన్నగవీచే చల్లగాలికి కనులు మూసినా కలలాయేబీ అలిగిన వేళనే చూడాలి గోకుల కృష్ణుని అందాలూ లాంటి పాటలు చిరస్థాయిగా నిలిచాయి.

# నివాసాల వద్ద ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం





**పాటించుకొని అధికారులు..**
**విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం..**
**ఇంటి యజమానులు భయాందోళనకు గురివుతున్నారు.**

**రామాయంపేట,జూలై 02(సూర్యరేఖ)** కొందరి సౌకర్యం కోసం మరొకరికి ఇబ్బందులు, ప్రాణాభయం వెంటాడుతుంటే ఆ యజమాని తన ఇంటి ప్రక్కనే వేసిన విద్యుత్ స్తంభం తొలగించాలంటూ ప్రాధేయపడుతున్నారు. వివరాల్లోకి వేళ్తే... రామాయంపేట పట్టణంలోని రాజేంద్రనగర్ సాయిబాబాగుడి వద్ద నివాస గృహాలకు ఏ మాత్రం దగ్గరగా లేకుండా రోడ్డుకు అటువైపున ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి ఇంటి పక్కనే పెద్ద లైను విద్యుత్ స్తంభం వేయడంతో విద్యుత్ తీగలు తమ పై అంతస్తులు తాకుతూ అతి దగ్గరలో ఉన్నాయని ఇండ్ల యజమానులు చందా రాములు,మర్కు రాములు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే బోరు ఉండడంతో ఇంటి యజమానులు భయాందోళ నలకు గురవుతున్నారు.రిటైర్డ్ లైన్మెన్ కుట్ర పన్ని కావాలని విద్యుత్ లైన్ని షిఫ్టింగ్ చేయించారని ఆరోపించారు.పిల్లలు పెద్దలు పైఅంతస్తులు వెళితే విద్యుత్ తీగలు తగులుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంతో కావడంతో స్పార్క్ తో ప్రమాదాలు ఏర్పడే ఆస్కారం ఉందనివారు వాపోతున్నారు.

**-స్థానికులు నాయకులు ఫిర్యాదు మేరకే విద్యుత్ స్తంభం మార్పిడి..**
**ట్రాన్స్కో ఏఈ తిరుపతిరెడ్డి**

ఈ విషయమై ట్రాన్స్కో ఏఈ తిరుపతిరెడ్డిని సంప్రదించగా కాలనీ ప్రజలు,స్థానిక నాయకులు ఒత్తిడి మేరకే విద్యుత్ స్తంభాన్ని మార్చడం జరిగిందని తెలిపారు.

# సైబర్ క్రైమ్ నివారణ పట్ల విద్యార్థులకు అవగాహన

ఎస్ఐ రాజేష్



**నిజాంపేట,జులై2(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు సైబర్ క్రైమ్ నివారణ పట్ల ఎస్ఐ.రాజేష్ అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అపరిచిత నెంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని ఎవరైనా ఓటీపీలు అడుగుతే చెప్పవద్దన్నారు.పోలీస్ అధికారులమని వాట్సాప్ కాల్ చేస్తే రెస్పాండ్ కావద్దన్నారు.ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురైనట్లయితే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలన్నారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదగిరి,హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్,డిబిఎఫ్ జిల్లా నాయకులు సంజీవ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ ముందుంటుంది



**నిజాంపేట,జులై2(సూర్యరేఖ)** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని నిజాంపేట మండల శాఖ తపస్ అధ్యక్షులు ఉమ్లా నాయక్ తెలిపారు.317 బాధితులకు న్యాయం చేయాలని, ఆర్థిక భారం లేని సమస్యలను వెంటనే పరిష్కరించాలని,ఆర్థిక భారం ఉన్నటువంటి సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నిజాంపేట మండలంలోని వివిధ పాఠశాలలో తోపాటు నార్లపూర్ స్కూల్లో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్,జిల్లా బాధ్యులు రవీందర్ రెడ్డి అర్జున్ ఉమామహేశ్వర్ కృష్ణగౌడ్ యాదగిరి రెడ్డి ప్రవీణ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నూతన అధ్యక్షుడు రామచందర్ రావును సత్కరించిన ఉప్పల్ బిజెపి శ్రేణులు





**ఉప్పల్,జూలై 02 (సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నారప రాజు రామచందర్ రావును ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణింద్ర ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులుని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మారినేని ఫణిందర్ మాట్లాడుతూ...నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు పార్టీ ప్రతిష్టత కోసం పనిచేస్తూ రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఆయన చేసిన సేవలకు తగిన గుర్తింపు పార్టీ ఇచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బలవంత చారి,డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్ రాష్ట్ర గీతసెల్ కన్వీనర్ పంజాల శ్రవణ్ గౌడ్ డివిజన్ కోశాధికారి దువ్వల రమేష్,సీనియర్ నాయకులు శ్రీధర్ గుప్తా,తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పద్మ అంజిరెడ్డి, అడెపు రమేష్ సాయి స్వామి రాజు అనిల్, తదితరులు పాల్గొని రాంచందర్ రావుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బెల్లంపల్లి కూరగాయ మార్కెట్లో అర్హులకు అన్యాయం..

**బిజెపి ఎస్సీ మోర్చా మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్**



**బెల్లంపల్లి,జూలై02(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో నూతన కూరగాయల మార్కెట్ డ్రాసిస్టం కలెక్టర్ సమక్షంలోనే జరిగింది.ఒక్కసారి వీడియోను పరిశీలనగ చూడండి మన మున్సిపల్ బిల్ కలెక్టర్ విజయ్,జేబులోనుండి మున్సిపల్ కమిషనర్ కి ఒక పేరు ఉన్న చిట్టిని తీసి ఇవ్వడం జరిగింది.ఆ పేరు తోకల మౌనిక ఇప్పుడు చెప్పండని బిజెపి పార్టీ ఆరోపిస్తున్నది.వాస్తవం కాదా అనర్హుల పేర్లను ప్రకటించారు ఇది అక్షర సత్యం వాళ్ళ పేర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.మార్కెట్ కూలగొట్టే సమయంలో ఫోటోలు,వీడియోలు తీసిన ప్రకారం ఎక్కడి వారికి అక్కడే సెటర్లు కేటాయించాలని,బెల్లంపల్లి,బిల్ కలెక్టర్ విజయ్ ని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం అని హెచ్చరించారు.

## బీజేపీ నూతన రథసారధి రామచందర్ రావు శుభాకాంక్షలు తెలిపిన ప్రభు పూజారి..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 2(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది ఏబీవీపీ సీనియర్ నాయకుడు,మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు ఎంపికైన సందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్గా బండారి రాధిక..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 2(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్గా బండారి రాధిక నియమితులైనట్లుగా ఓ ప్రకటనలో వారు తెలిపారు.ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడినందుకు తనను గుర్తించి బీజేపీ ఆల్ ఇండియా కౌన్సిల్ మెంబర్గా నియమించినారని,ఇందుకుగాను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,బీజేపీ సీనియర్ బండి సంజయ్,డాక్టర్ కె.లక్ష్మణ్,రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు, లకు ధన్యవాదాలు,సహచర నాయకులందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఇది ఒక పదవి మాత్రమే కాదనిక,ఇది ఒక గొప్ప బాధ్యత అన్నారు.నా రాజకీయ సేవను దేశానికి అంకితం చేస్తున్నానని రాధిక పేర్కొన్నారు.

## ఘనంగా కళాకారుడు,తాజా మాజీ ఉపసర్పంచ్ దుర్గయ్య జన్మదిన వేడుకలు..



**అందోల్,జులై02(సూర్యరేఖ)** కళాకారుడు,తాజా మాజీ ఉపసర్పంచ్ దుర్గయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహ్మదాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బుక్స్,షూ పెన్నులు పరీక్ష ప్యాడులు పంపిణి చేశారు.వీరితోపాటు తాజా మాజీ సర్పంచ్ సంగమేశ్వర్ పాటేల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్, సిద్దయ్య దశరథ్నాగేందర్ పాటేల్,నాగయ్య,స్వామి, అంజి రాజేందర్ పి,ప్రవీణ్ చెంద్రశేఖర్ ఎం.ప్రవీణ్, శంకర్,వెంకట్,అంగన్వాడీ టీచర్ సంగీత శ్రీకాంత్, బన్నీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..



**రామయంపేట, జూలై 02(సూర్యరేఖ)** బీక్కనూర్ 44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన కొత్తేనుగు లక్ష్మీనారాయణ (50) జంగంపల్లి విజయ ల్యాబరేటరీ ప్రయివేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు.బుధవారం మధ్యా హ్నం డ్యూటీ ఉందని అక్కన్నపేటకు వచ్చి తిరుగు ప్రయాణమై వెళుతున్న క్రమంలో బీక్కనూర్ గ్రామంలోనికి వెళ్ళే ముందు రోడ్డు క్రాసింగ్ లో వెనుక నుంచి కంటైయినర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతునికి భార్య యాదమ్మ ఇద్దరు ఆడపిల్లల అఖిల శిరీష ఉన్నారు

# మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**ఖర్గే సభను విజయవంతం చేయాలని నాయకులకు సూచించిన మంత్రి**

**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)** మేడ్చల్ మల్కాజిగిరి ఇన్ చార్జీ మంత్రి శ్రీధర్ బాబు ను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి పార్టీ బలోపేతం కోసమే చర్చించారు.ఈ నెల 4వ తేదీన జరిగే గ్రామ, మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల బహిరంగ సభకి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నారు.ఈ సభను విజయవంతం చేసేందుకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తల ను తరలించి విజయవంతానికి కృషి చేయాలని వారికి మంత్రి ఆదేశించారు. మొదటిసారి రాష్ట్రానికి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు వస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతగా గుర్తించి సభను విజయవంతం చేయడానికి నాయకులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి,గడ్డం రవికుమార్ యువజన కాంగ్రెస్ మాజీ జాతీయ కో-ఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్ నాగేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# మల్లికార్జున ఖర్గే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలి





**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జులై 02(సూర్యరేఖ)** జైబాపు,జైభీం,జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గె ఈనెల 4న నగరానికి రానున్నారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి నేతృత్వంలో బుధవారం నియోజకవర్గంలోని కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులతో సన్నాహక సమావేశం ఉప్పల్ లో నిర్వహించారు.జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి,కో-ఆర్డినేటర్లు గజ్జల కాంతం,శశికళ యాదవ్,మిథున్ రెడ్డి హాజరై మాట్లాడారు.. ఖర్గే కార్యకర్తలతో నేరుగా మాట్లాడతారని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై దిశానిర్దేశం చేస్తారని ఆయన చెప్పారు. అనంతరం జరిగే బహిరంగ సభలోను ఖర్గె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతారన్నారు. జాతీయ అధ్యక్షులు తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్నట్టుగా చెప్పారు. గ్రామ,వార్డు కమిటీలను ఒక జాతీయ అధ్యక్షులు కలువడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్,చర్లపల్లి,కాప్రా కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి,రజిత పరమేశ్వర్ రెడ్డి స్వర్ణరాజ్ శివమణి ఉప్పల్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్,రఫీక్ విజయ్,శ్రీకాంత్ గౌడ్,కోలేపాక అంజన్న,కాప్రా సాయిగౌడ్,కాశెట్టి ప్రసాద్ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి,నాగ శేషు,ఉప్పల్ యూత్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్,కో-ఆర్డినేటర్లు సీతరామ్ రెడ్డి,రాజేందర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి,అంజి రెడ్డి,బజారు జగన్నాథ్ గౌడ్,ప్రకాష్ రెడ్డి,రఘుపతి రెడ్డి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైపులైన్ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్

**ఉప్పల్,జులై 02(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్ లోని బ్యాంక్ కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను జిహెచ్ఎంసి అధికారులతో బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కలిసి పర్యవేక్షించారు. బ్యాంక్ కాలనీలోని స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులకు ఎలక్ట్రికల్ పోల్స్ అడ్డు రావడంతో ఎస్ఈ.అశోక్ రెడ్డి,కార్పొరేటర్ బన్నాల గీత,లకు తెలియజేయడం జరిగింది.ఎస్ఈ అశోక్ రెడ్డి,కార్పొరేటర్ గీత ప్రవీణ్,ఉప్పల్ సర్కిల్ ఈ.ఈ.హరిలాల్,డి.ఈ.వెన్నెల గౌడ్,ఏఈ రాధిక లతో పరిశీలించారు.స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను అడ్డుగా ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్ ని వెంటనే తొలగించాలని జిహెచ్ఎంసి అధికారులు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎలక్ట్రికల్ పోల్స్ ని బుధవారం తొలగించి స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లను సాఫీగా వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్,సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి,బ్యాంక్ కాలనీ అసోసియేషన్ బ్యాంక్ కాలనీ సెక్రటరీ గఫుర్ భాయ్,సందీప్,శేఖర్,రమేష్,శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.





## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఉప్పల్ కాంగ్రెస్ నాయకులు..

**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబును బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తవిడబోయిన గిరిబాబు,ఏఎస్ రావునగర్ మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి,ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సర్వీ మురళీ గౌడ్,లు మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి చర్చించి, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయమని కోరారు.ఈనెల 4న జరిగే ఖర్గే సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని వారికి సూచించారు.



## దహన సంస్కారాలకు ఆర్థిక సాయాన్ని అందించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి..



**నిజాంపేట,జులై2(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన కొండేరి బాల్ చంద్రం(45) అనారోగ్యంతో బుధవారం మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతిని దహన సంస్కారాలకై గ్రామ బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చల్మెటి నాగరాజు, మండల యూత్ అధ్యక్షులు మావురంరాజు, రాములు గౌడ్,చిట్టి సదాశివ లింగం,మావురం వినయ్,వీరమల్లు బాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉప కేంద్రం వారి ఉచిత వైద్య శిబిరం..



**నిజాంపేట,జులై2(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో బిపి,షుగర్,పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యగా గ్రామ ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఏలాంటి రోగాలు దరిచేరవన్నారు.సీజనల్ వ్యాధులు డెంగ్యూ మలేరియావ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వర్షాలకు కూలిన ఇల్లు..

**నిజాంపేట,జులై2(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గత రెండు రోజుల వర్షానికి పెంకుటిల్లు కూలిపోవడం జరిగింది.ఈ మేరకు గ్రామానికి చెందిన మన్నె ప్రమీల జలంధర్,పెంకుటిల్లు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెనుక భాగం కూలిపోయింది.ఉన్న ఇల్లు కాస్త కూలిపోవడంతో ఎక్కడ ఉండేది అని కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రభుత్వ అధికారులు పరిశీలించి మాకు న్యాయం చేయాలని కోరుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూడాలన్నారు.



## జులై 9 సమ్మెను జయప్రదం చేయాలి..

**టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్ సింగ్**



**బెల్లంపల్లి,జూలై 02(సూర్యరేఖ)** ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఐక్యగని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్ కాస్టో వారు మాట్లాడుతూ...కార్మిక చట్టాల రద్దు మానుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలన్నారు.బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నారు. బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి,ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సత్యం రాజబాబు శివప్రసాద్ ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు ఎండి చాంద్ పాషా,పి.శ్రీనివాస్,టిఎన్ టి యుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.మని రామ్ సింగ్ మేకల రాజయ్య,ఎం.తిరుపతి,చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం





**కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.రామంతపూర్ డివిజన్ ఏడిఆర్ఎం హాస్పిటల్ నుండి కార్డినల్ గ్రేసెస్ స్కూల్ వరకు రూ. 1.30 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నానని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ. ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ డివిజన్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయింపజేసి పనులు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు బాలరాజు,కాపర్తి మోహన్,రమేష్,బిజెపి నాయకులు కుమార్ స్వామి,నిరంజన్ గౌడ్ దయాకర్ రెడ్డి కృష్ణమూర్తి,బీఆర్ఎస్ నాయకులు బోసాని పవన్, మహమ్మద్ జాంగిర్ మంజుల ఇందిరా,శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విస్తృత పర్యటన





**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)** ప్రగతినగర్ కాలనీ లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు,లతో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించారు.ప్రగతి నగర్ లో ప్రధానంగా డ్రైనేజ్, స్ట్రాం వాటర్ డ్రైన్ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే,కార్పొరేటర్ లకు తెలపడంతో బుధవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించడం జరిగింది. ప్రగతి నగర్ లో నిరుపయోగమైన బాక్స్ డ్రైన్ వినియోగం పై ఎమ్మెల్యే,కార్పొరేటర్ లకు స్థానికులు విన్నవించడం జరిగింది.మూడు దశాబ్దాల క్రితం ఏర్పడిన కాలనీ రామంతపూర్‌లో ఏకైక హెచ్ఎండీఏ లేఅవుట్‌గా గుర్తింపు పొందినదని, అప్పట్లో కాలనీకి పైన ఉన్న పెద్ద చెరువు అవుట్‌లెట్‌ను దృష్టిలో ఉంచుకుని సుమారు 600 మీటర్ల పొడవు,12 అడుగుల వెడల్పు,4 అడుగుల లోతుతో బాక్స్ డ్రైన్‌ను నిర్మించారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు కింద పెద్ద చెరువు నుండి రామంతపూర్ చర్చ్ గోదాం నేతాజీనగర్, గాంధీనగర్ మీదుగా ప్రధాన కాలువ వరకు కొత్త బాక్స్ డ్రైన్‌ను నిర్మించింది. గత రెండేళ్లుగా భారీ వర్షాలు వచ్చిన కూడా ఈ డ్రైన్ ద్వారా సమర్థవంతంగా నీటి నిష్క్రమణ జరగుతోంది.ఈ నేపథ్యంలోగా కాలనీలోని పాత బాక్స్ డ్రైన్ ప్రస్తుతం పూర్తిగా నిరుపయోగంగా మారింది.ఇది వాడుకలో లేక పోవడం వలన సుందిలకలు పాములు విషపూరిత పురుగులు అందులో స్థానం చేసుకొని, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయి.ఇక ఇప్పటికే రైన్ వాటర్ డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా ఎదురవుతున్న కాలనీవాసులు ఈ డ్రైన్‌ను పునః వినియోగం చేస్తూ స్ట్రాం వాటర్ డ్రైన్, డ్రైనేజ్ లైన్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరడం జరిగినది.ఇదే సమయంలో రహదారి వెడల్పు పెరిగే అవకాశం కూడా ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ సమస్యను వెంటనే ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బండారు వెంకట్రావు,కాలనీ అధ్యక్షులు కృష్ణమూర్తి,వెంకట్ రెడ్డి బుచ్చిరెడ్డి జగదీశ్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్,ప్రభాకర్ యాదవ్ శివప్రసాద్,చెల్లా మురళీధర్ రాజగోపాల్ పవన్ జహాగీర్,సూరాం శంకర్,చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు అధికమయ్యేలోపు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి





## నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**ఉప్పల్,జూలై02(సూర్యరేఖ)** వర్షాలు అధికం కాకముందే సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ అధికారులకు సూచించారు.రూ.20 లక్షల వ్యయంతో రవీంద్రనగర్ సాయిబాబాగుడి కమాన్ నుండి ముందు చౌరస్తా వరకు జరుగుతున్న నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కార్పోరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ బుధవారం పర్యవేక్షించడం జరిగింది.అలాగే అంబేద్కర్ విగ్రహం వద్ద నాచారం పెద్దనాలపై భవాని నగర్ వెళ్లే దారిలో నిర్మిస్తున్న కొత్త వంతెన పనులను కూడ కార్పొరేటర్ పర్యవేక్షించడం జరిగింది. వంతెన పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని తొందర్లోనే వంతెన పైనుండి రాకపోకలు ప్రారంభిస్తామని కార్పొరేటర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఈ. బాలకృష్ణ ఏ.ఈ.లు కీర్తి,వినీత్,వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్,విఠల్ యాదవ్,కట్ట బుచ్చన్నగౌడ్,ఎర్రం శ్రీనివాస్ రెడ్డి భూపాల్ రెడ్డి,రాంచందర్ యూసుఫ్ నర్సింగ్ రావు సుగుణాకర్ రావు,హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ ని సన్మానించిన సిపిఐ నాయకులు

బెల్లంపల్లిలోని సమస్యలను పరిష్కరించాలి..



**బెల్లంపల్లి,జూలై 02(సూర్యరేఖ)**బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన రమేష్ ను బుధవారం సిపిఐ నాయకులు మర్యాద పూర్వకముగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బెల్లంపల్లిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ రమేష్ కు వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో రోడ్లు మరమ్మతులు చేపట్టాలని,లేని చోట నూతన రోడ్లు వేయాలన వార్డులకు ప్రతిరోజు మంచినీరు సరఫరా చేయాలన్నారు. పేరుకే మంచినీరు అవి మురికి రావడం ప్రజలకు ఎలాంటి ఉపయోగలేకపోవడం జరుగుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని మంచినీరు శుభ్రంగా ప్రజలకు అందించే ప్రణాళిక చేయాలని వారు ఈ సందర్భంగా తెలిపారు.రోడ్డు వెడల్పుతో ఉపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని పట్టణ కార్యదర్శి రాజమౌళి కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ శాఖ అధికారులు సూచించే సూచనలు ప్రజలు పాటించాలి...


ఉప్పల్ విద్యుత్ శాఖ ఏడిఈ రవీందర్



**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)**వర్షాకాలంలో ప్రజలు విద్యుత్ శాఖ అధికారులు సూచించే సూచనలు ప్రజలు పాటించాలని ఉప్పల్ సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడిఈ రవీందర్ తెలిపారు.బుధవారం విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా బోడుప్పల్ విద్యుత్ కార్యాలయంలో ఉప్పల్ సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు,స్టాఫ్, ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ...వర్షాకాల సమయంలో మరమ్మత్తుల సమయంలో సిబ్బంది పాటించాల్సిన విషయాలను వివరించారు.ఇందులో భాగంగా స్టాఫ్ కి మరమ్మతుల సమయంలో పాటించవలసిన భద్రతల గురించి చెప్పడం జరిగింది. ప్రజలు కూడా వర్షకాల సమయంలో పాటించవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.ఈ సమావేశంలో ఉప్పల్ ఏడిఈ రవీందర్ బోడుప్పల్ ఏఈ వేణుగోపాల్, ఉప్పల్ ఏఈ నిఖిల్,ఉప్పల్ బాగాయత్ ఏఈ.కిరణ్ కుమార్ రెడ్డి,చిల్కనగర్ ఏఈ.వినయ్ కుమార్ రెడ్డి, రామంతాపూర్ ఏఈ. లావణ్య,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ గడ్డ తిండి తింటూ,తెలంగాణ నాయకులు మీద విషం చిమ్మడం జర్నలిజమా.?

ఠాకూర్ జీవన్ సింగ్



**నాంపల్లి,హైద్రాబాద్, జూలై 2 (సూర్యరేఖ)** తెలంగాణగడ్డ మీద ఉంటూ తిండి తింటూ విషం చిమ్మడం జర్నలిజమా.? తెలంగాణ నాయకులు మీద అసత్యాలు ప్రసారంచేయడం జర్నలిజమా? అని జర్నలిజం ముసుగులో ఏపి మీడియా విషం కక్కడంపై కార్వాన్ నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్చార్జి ఠాకూర్ జీవన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఠాకూర్ జీవన్ సింగ్ మాట్లాడుతూ. నిజంగా బీఆర్ఎస్ నాయకులు తప్పు చేస్తే చట్టం ఉంది న్యాయ స్థానాలున్నాయి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలున్నాయి,దర్యాప్తు సంస్థలున్నాయి అది నిర్ణయిస్తాయి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు కేటిఆర్ నేరం చేస్తే శిక్షిస్తాయి కానీ జర్నలిజం ముసుగులో ఏపి మీడియా సంస్థలు ఆరాచకం చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా బట్టలూడదీసి తరిమికొడతాం అని హెచ్చరించారు. అసలు మీడియా అంటే ఏమిటో అర్ధం తెలియని వాళ్లు ఏపి మీడియా సంస్థలు,కులపోల్లయితే,ఏపి నుంచి వస్తే చాలు వాళ్లను కుర్చీల్లో కూర్చోబెట్టి,తెలంగాణ మీద విషం చిమ్మితే ఊరుకోవాలా అని ప్రశ్నించారు.తెలంగాణలో మీడియా సంస్థలు నడుపుతారు,తెలంగాణ జర్నలిస్టులను తప్పుదోవ పట్టిస్తారు ఇది ఎంతవరకు సమంజసం అని నిలదీశారు.తెలంగాణ వారితో తప్పులు చేయిస్తూ,తప్పుడు కథనాలు రాయిస్తారని,తెలంగాణ వారి కళ్లలో తెలంగాణ వేళ్లతోనే పొడిపిస్తారని ఏపి మీడియా సంస్థల నైజమని అన్నారు.అరవై ఏళ్లకుపైగా ఉమ్మడి పాలకులు చేసిన పని,ఇప్పుడు ఏపి మీడియా చేస్తోంది ఇది తెలంగాణ సమాజం గమనించాలని హెచ్చరించారు.

# మేడారం సమ్మక్క,సారలమ్మ మహాజాతర తేదీలను ఖరారు






**ములుగు,జూలై 02(సూర్యరేఖ)** తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర తేదీలు ఖరారు అయ్యాయి. మేడారంలో సమ్మక్క సారాలమ్మ మహా జాతర తేదీలను అక్కడి పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించింది.2026 జనవరి 28వ తేదీన(బుధవారం)శ్రీసారాలమ్మ దేవత 29న సమ్మక్క దేవతలు (గురువారం) వారివారి గద్దెల మీదకు చేరుకుంటారు.30వ తేదీన (శుక్రవారం) మొక్కులు చెల్లించుట,31వ తేదీన (శనివారం)సమ్మక్క, సారలమ్మ వనదేవతలు గోవిందరాజు పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశం చేయడం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పూజారులు నిర్ణయించారు.మేడారంలో జరిగే ఈ జాతరకు భారతదేశం అంతటా లక్షలాది మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.లక్షలాది మంది భక్తులు బెల్లాన్ని 'బంగారం'గా పూజించి దేవతకు సమర్పిస్తారు. 31న అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.మేడారం మహా జాతర వచ్చే భక్తులకు వసతి కల్పించడానికి అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

# నార్సింగిలో యువకుడు దారుణ హత్య






**నార్సింగి,జూలై 02(సూర్యరేఖ)** నగర శివారు నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు.పశ్చిమ బెంగాల్ కు చెందిన రోషన్ లాల్(43) పెయింటింగ్ పని చేసేవాడు.వారం రోజుల క్రితం ఉపాధి కోసం బెంగాల్ నుంచి అతని స్నేహితుడు రంజిత్ తో కలిసి వచ్చాడు. పుప్పాలగూడలోని లేబర్ క్యాంపులో ఉంటూ పని చేసుకుంటున్నాడు. బుధవారం ఉదయం అతడి గొంతులో ఇనుప రాడ్డు దించి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.హత్యకు గురైన రోషన్ లాల్ వెంట వచ్చిన మరో కార్మికుడు రంజిత్ కనిపించకుండా పోవడంతో అతనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

## పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలే శ్రీరామరక్ష..

## కార్మిక సంఘాల జేఏసీ పిలుపు..



**మందమర్రి,జూలై 02(సూర్యరేఖ)** పోరాటాల ద్వారా కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలే శ్రీరామరక్ష అని,కార్మికులకు వ్యతిరేకంగా 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన జూలై 9 దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు.పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,ఐఎన్టియుసి సెంట్రల్ కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య సిఐటియు ఎస్.నాగరాజ గోపాల్,టీబీజీకేఎస్ మేడిపల్లి సంపత్, ఇఫ్టు నాయకులు సంపత్,లు మాట్లాడుతూ... కార్మికులు సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించి కార్మిక చట్టాలను రద్దు చేయడంతో, కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడానికి సిద్ధమైందని,ఇదే జరిగితే కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను మన సింగరేణిలో పనిచేస్తున్న సంఘటిత,అసంఘటిత కార్మికులు ఓపెన్ కాస్ట్ ఓబి కార్మికులతో పాటు సింగరేణి వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అన్ని వర్గాల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు సలేంద్ర సత్యనారాయణ,దాగం మల్లేష్ భీమనాధుని సుదర్శన్,సివి రమణ పెద్దపెల్లి బానయ్య,ముల్కల పల్లి వెంకటేశ్వర్లు శంకర్ రావు,మిట్ట సూర్యనారాయణ దార బిక్షపతి పానుగంటి వెంకటస్వామి,రామగిరి రామస్వామి ఐలయ్య, వీరారెడ్డి,తిరుపతి,అన్ని గనులు డిపార్ట్మెంట్ల పిట్ కార్యదర్శులు,జేఏసీ కార్మిక సంఘాలు ఏఐటియుసి, ఐఎన్టియుసి సిఐటియు టిబిజికేఎస్ జిఎల్ బికేఎస్ (ఇఫ్టు) సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 15 లోపు అర్హులందరికీ రేషన్ కార్డులు..

### దళారులను ఆశ్రయించవద్దు.. ఉప్పల్ ఏఎస్ఓ సంధ్య



**ఉప్పల్,జూలై 02(సూర్యరేఖ)** రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించవద్దని ఉప్పల్ ఎఎస్ఓ సంధ్య అన్నారు.బుధవారం తన కార్యాలయంలో "సూర్యరేఖ"తో మాట్లాడుతూ... రేషన్ కార్డు కోసం మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని తెలిపారు.ఈ నెల 15వ తేదీలోగా అర్హులందరికీ కార్డులను జారీ చేస్తామని చెప్పారు. కార్డుల కోసం మధ్య దళారులను ఆశ్రయిస్తే మోసపోతారని స్పష్టం చేశారు.డిలీట్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని,కార్డులో పేర్లు డిలీట్ దరఖాస్తులను ఆఫీసు వద్ద ఇచ్చి వెళ్లాల్సిందిగా కోరారు.తీసుకున్న డిలీట్ దరఖాస్తులతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం విచారణ చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే కార్యాలయానికి వచ్చి నేరుగా తనను కలవాల్సిందిగా ఎఎస్ఓ సంధ్య తెలిపారు.

## మెదక్ ఎంపీ రఘునందన్ రావుని పరామర్శించిన బిజెపి నాయకులు..



**శివంపేట,జూలై 02(సూర్యరేఖ)** సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్ లో కాలికి శస్త్ర చికిత్స చేయించుకొని చికిత్స పొందుతున్న మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుని హాస్పిటల్ లో భారతీయ జనతాపార్టీ యువ నాయకులు అశోక్ సాదుల,బీజేపీ సీనియర్ నాయకులు వెల్మకన్న,మాజీ సర్పంచ్ కాజీపేట రాజేంధర్,హవేలీ ఘనపూర్ మాజీ మండల అధ్యక్షులు ఈర్ల రంజిత్ రెడ్డి,లు పరామర్శించారు. అనంతరం రఘునందన్ రావు,అశోక్ సాదులతో మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శివంపేట మండలంలోని ప్రతి గ్రామంలో గెలిచి బీజేపీ జెండాను ఎగరవేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నీలి నాగేష్ ,చంద్రంగౌడ్,విశ్వ, తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు సన్మానం



**కామారెడ్డి,జూలై02(సూర్య రేఖ)**రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు అయిన ఉప్పల శ్రీనివాస్ గుప్తాను కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు సన్మానించారు.అనంతరం శ్రీనివాస్ గుప్తా,కైలాస్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ..జులై 4న ఎల్బీ స్టేడియంలో నిర్వహించబోతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల బహిరంగసభకు,జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశానుసారం నియోజకవర్గంలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,పార్టీ మండల అధ్యక్షులు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ జెడ్పిటిసిలు,ఎంపీటీసీలు,సర్పంచులు సీనియర్ నాయకులు అనుబంధ సంఘాలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండ్ల రాజు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్,జిల్లా లీగల్ చైర్మన్ దేవరాజు గౌడ్,ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్,బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుట్నాల శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్లు కన్నయ్య,రవీందర్ గౌడ్,చాట్ల రాజేశ్వర్,రాజా గౌడ్,బట్టు మోహన్,మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్,లక్కపత్ని గంగాధర్,పడిహార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనం వృధా చేయడంపై బీఆర్ఎస్ నాయకుల మండిపాటు





**రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలి..**

**మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**

**మణికొండ,జులై02(సూర్యరేఖ)** మణికొండ మున్సిపాలిటీలో ప్రజాధనం వృధా చేస్తున్నారని మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు.ల్యాంకో హిల్స్ మొదలుకొని లక్ష్మీనగర్,అంజలీగార్డెన్ వరకు 2022 లో రోడ్డు వేయడం జరిగిందని,కానీ ఇప్పటి వరకు రోడ్డు సమస్యకు పరిష్కారం దొరకడం లేదన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...గత అసెంబ్లీ ఎన్నికల సమయం 2023లో టీమ్స్ ఫోర్ ప్రాజెక్ట్ వారి స్వలాభం కొరకు మణికొండ మున్సిపాలిటీ ల్యాంకో హిల్స్ దాటిన తరువాత లక్ష్మీనగర్ మొదలుకొని అంజలీగార్డెన్ వరకు రహదారి మద్యలో డ్రైనేజ్ పెద్దలైన్ వేయడం కొరకు వారు రోడ్డును త్రవ్వడం చేసిన నిర్వాకం వలన ప్రజాధనం దుర్వి నియోగం జరిగిందన్నారు.పై పెచ్చు నాలుగైదు పర్యాయాలు రోడ్డు కృంగిపోవడం ప్రజలు ఇబ్బందులపాలవుతు న్నారన్నారు. మున్సిపాలిటీ అధికారులు అందుకు తగ్గట్టు తూతూ మంత్రంగా నాసిరకంగా మరమ్మత్తులు చేయడం మినహా అందుకు సంబంధించిన టీమ్స్ ఫోర్ ప్రాజెక్ట్ వారి వద్ద నుండి ఎలాంటి నష్ట పరిహారం వసూలు చేయకపోవడం ఏంటని,ఘనత వహించిన అప్పటి మున్సిపాలిటీ ప్రజా పరిపాలకుల సభ (కౌన్సిల్) నిర్వాక ఫలితమని స్థానికులు వాపోయారు. సంఘటితంగా భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు బుధవారం రోజున స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి తిరగడం జరిగిందన్నారు.ఇండ్ల మధ్యలో పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నడుపుతూ,అందుకు సంబంధించిన వాహనాలు తిరగడంలో కూడా రోడ్డు ధ్వంసమౌతుందని,ఈ విషయమై స్థానికుల కు భారత రాష్ట్ర సమితి మణికొండ మున్సిపాలిటీ మద్దతుగా ఉంటుందని తెలిపారు.ప్రజా పరిపాలన సమయం ముగిసిన ప్రస్తుత తరుణంలో రూ.60 లక్షల బడ్జెట్ తో రోడ్డును వేయడానికి పూనుకోవడం ఇందుమూ లంగా ప్రజాధనం దుర్వినియోగపరచడమని తెలియపరుస్తూ కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రజల మేలుకోరి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్,ఉపేంద్రనాధ్ రెడ్డి,అందె లక్ష్మణ్ రావు,సంగం శ్రీకాంత్,యాలల కిరణ్ భానుచందర్,మహమ్మద్ ఆరీఫ్,సుమ నళిని,షేక్ ఆరీఫ్,శ్యామలేట్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్స్ పరీక్షల్లో మహిళా నియామకాల్లో అవకతవకలపై విచారణ చేయాలి





**మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్,జులై02(సూర్యరేఖ)** గ్రూప్స్ పరీక్షల లో మహిళా నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేయాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.ఈ మేరకు చర్చించేందుకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కంటెస్టెడ్ ఎమ్మెల్యే దాసరి ఉష,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పి.కార్తీక్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిన అంశాలను మాజీ మంత్రికి వివరించి మహిళలకు అన్యాయం జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ. గ్రూప్ 2,3 నియమాల్లో మహిళా నియమాల్లో విచారణ జరపాలని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలన్నారు.ఈ సమావేశంలో కొంపల్లి జగదీష్ యాదగిరి భాస్కర్ మల్లేష్,నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ ఎస్ పార్టీ నాయకులు

-మండలంలో మళ్లీ బలపడుతున్న కాంగ్రెస్ పార్టీ....



**కొల్చారం,జులై02 (సూర్య రేఖ)** ప్రభుత్వం ప్రవేశపెడు తున్న సంక్షేమ పథకాల అమ లు తీరుకు ఆకర్షితులై బిఆర్ ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. బుధవారం మండల పరిధిలోని ఏనగండ్ల గ్రామం లో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, నర్సా పూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో మండల అధ్యక్షు లు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.కొత్త పాత అనే తారతమ్యం లేకుండా సమన్వయంతో కృషి చేసి స్థానిక ఎన్నికలలో విజయదుందుబి మోగించాలని వారు సూచించారు. ఎనగండ్ల గ్రామ యువ నాయకులు ప్రవీన్ రెడ్డి,పాండు రంగారెడ్డిల ఆధ్వర్యంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్ రాజు మల్లేశం లక్ష్మణ్, చంద్రయ్య,నరేందర్ రెడ్డి,యాదుల్,కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఎస్సీ విద్యార్థినిలకు స్పాట్ అడ్మిషన్స్




**రామాయంపేట,జూలై02(సూర్య రేఖ)** తెలంగాణ సాంఘిక సంక్షేమ మెదక్ మహిళ డిగ్రీ కళాశాల రామాయంపేట పట్టణంలో నడుపుతున్న నేపథ్యంలో ఎస్సీ విద్యార్థినిలకు మొదటి సంవత్సరంకు గాను కళాశాలలో బిజెడ్సి ఎంజెడ్సి ఎంపీసీ ఎంపీసీఎస్,ఎంఎస్సీఎస్,బీకాం,సిఎ,బిఏ కోర్సులలో ప్రవేశాలకు ఖాళీగా ఉన్న ఎస్సీ అభ్యర్థినిల సీట్లకు ఆసక్తిగల విద్యార్థినిలు నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపల్ కె.శిరీష మీడియా సమావేశంలో తెలిపారు.పూర్తి వివరాలకు 7995010678 మొబైల్ నెంబర్ లో సంప్రదించాలన్నారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ. కళాశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయునిలు ఉచిత పుస్తకాలు యూనిఫామ్ పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజు నాణ్యమైన భోజనం,అందిస్తామని ఆమె పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెందిన ఎస్సీ విద్యార్థినీలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

## గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్న రజియా సుల్తానా..

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**మందమర్రి,జూలై 02(సూర్యరేఖ)** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ (పిహెచ్డి) పురస్కారం అందుకున్న ఈజిఎస్ ఎపిఓ రజియా సుల్తానాను ఎంపీడీవో ఎన్.రాజేశ్వర్ ఆధ్వర్యంలో మండల సిబ్బంది,నాయకులు ఘనంగా సన్మానించారు. ఏసియా ఇంటర్నేషనల్ వైదిక్ అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక సేవ అంశంపై ఏపీవో రజియా నిర్వహించిన పరిశోధనకు గాను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ హైదరాబాదు నుండి గౌరవ డాక్టరేట్ ఇటీవల అందుకున్నారు.ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్ తో పాటు మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు,కార్యాలయ సిబ్బంది పలు పార్టీల నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించి డాక్టరేట్స్ గ్రహీత రజియా సుల్తానా చేసిన కృషిని సాధించిన విషయాన్ని కొనియాడు తూ అభినందించారు.ఈ సందర్భంగా రజియా సుల్తానా మాట్లాడుతూ. డాక్టర్స్ పట్టా రావడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.ఈ అవార్డు రావడానికి సహకరించిన ప్రభుత్వ అధికారులకు సిబ్బందికి, సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనా రాయణ,ఏపిఎం లలిత,ఈజీఎస్ ఈసి మధు టిఎ.రాజమల్లు, కుమార్ తిరుమల,ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య,ఫీల్డ్ అసిస్టెంట్,లు సత్యనారాయణ,రాజేందర్,గందె రాంచందర్ ఓడ్నాల కొమురయ్య,ఫిరోజ్,కార్యాలయం సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా..

కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పుప్పాల కృష్ణమూర్తి



**రాజేంద్రనగర్,జులై02(సూర్యరేఖ)** అత్తాపూర్ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పుప్పాల కృష్ణమూర్తి అన్నారు.రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ చైర్మెన్ పి.పెంటయ్య ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులుగా పుప్పాల కృష్ణమూర్తి నియమితులయ్యారు.ఈ సంద ర్భంగా పుప్పాల కృష్ణమూర్తి మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుంద న్నారు.అన్ని పథకాలను ప్రజలకు చేరువ చేసి అన్ని వర్గాల ప్రజలకు సంక్షే మ ఫలాలు అందేలా చూస్తానని అన్నారు.తనపై పెట్టుకున్న నమ్మకా నికి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పని చేస్తానని కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీని అందుకు న్నారు.రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు ప్రీతం కుమార్కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజ న్ కాంగ్రెస్ అధ్యక్షులు గొంది ప్రవీణ్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ సులిగే మహేందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.రవీందర్ కుమార్ ఎస్.మహేష్, సూరి,బంటి,ప్రార్ధసారధి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జలమండలిలో ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం..



**ఖైరతాబాద్,జులై02(సూర్యరేఖ)**జలమండలిలో వివిధ హోదాల్లో పనిచే సిన 53 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు.బోర్డు పరిధిలోని పలు డివిజన్లలో పనిచేసిన వారంతా..గత నెల 30న పదవీ విరమణ పొందారు.ఇందులో ముగ్గురు డిప్యూటీ జనరల్ మేనేజర్లు,ముగ్గురు సీనియర్ ఆఫీసర్లలతో పాటు మరో 47 మంది వివిధ హోదాలో పనిచేశారు.వీరందర్నీ ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు,సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్,సీజీఎం సురేష్,జీఎం సరస్వతి,ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొల్చారం మండలంలో కాంగ్రెస్ నాయకుల సుడిగాలి పర్యటన





- ట్రబుల్ షూటర్ హరీష్ పేదోళ్లకు ఇల్లిచ్చావా...
- కాళేశ్వరం పేరిట కోట్లు దండుకున్నది కల్వకుంట్ల కుటుంబం...
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,నర్సాపూర్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి...

**కొల్చారం,జులై02(సూర్య రేఖ):** కాళేశ్వరం పేరిట కోట్లు దండుకున్న కల్వకుంట్ల కుటుంబం ప్రజలలో అస్తిత్వం కోల్పోయిందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు ఆరోపించారు.బుధవారం మండల పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొల్చారం అప్పాజీపల్లి, రంగంపేట తుక్కాపూర్,పైతర,కోనాపూర్,మాందాపూర్ ఎనగండ్ల గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాజి రెడ్డి, ఆంజనేయులు గౌడ్ లు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణలో గతంలో ట్రబుల్ షూటర్ అని చెప్పుకున్న నాటి ఆర్థిక మంత్రి హరీష్ రావు ఏ ఒక్కరి పేదోడికైనా ఇల్లు ఇచ్చిన పాపాన పోలేరని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి మహాలక్ష్మి రైతు భరోసా రుణమాఫీ ఇందిరమ్మ ఇళ్ల పథకాలను చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత పదేళ్లలో కేవలం రైతు బంద్ పథకంతో ప్రజలలో పబ్బం గడుపుకోగా విరక్తిచెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు.మాట తప్పని మడమ తిప్పని కాంగ్రెస్ ప్రభుత్వంను ఆశీర్వదిస్తూ స్థానిక ఎన్నికలలో అత్యధికంగా సర్పంచ్ ఎంపీటీసీలను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి,యెల్లు గారి శ్రీనివాస్ రెడ్డి,మరెల్లి అనిల్,మాజీ సర్పంచ్ లు మాదవి శ్రీశైలం,గజినీ వెంకట్ గౌడ్ శ్రీశైలం మన్నే శ్రీనివాస్ నర్సింలు వడ్ల లక్ష్మీపతి,బండి రమేష్ శేఖర్ మహేశ్వర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,బాల్ రాజ్,జయరాం రెడ్డి అక్రమ్ గోవర్ధన్,ప్రవీణ్ రెడ్డి,అశోక్,పహాడ్,దన్ రాజ్,ఆగం గౌడ్,రవీందర్ గౌడ్,బండి మల్లేశం పాపయ్య జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు..

-మండలంలో మళ్లీ బలపడుతున్న కాంగ్రెస్ పార్టీ....



**కొల్చారం,జులై02(సూర్య రేఖ)** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితులై బిఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు.బుధవారం మండల పరిధిలోని ఏనగండ్ల గ్రామంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీలో చేరిన నాయకులు,కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.కొత్త పాత అనే తారతమ్యం లేకుండా సమన్వయంతో కృషి చేసి స్థానిక ఎన్నికలలో విజయదుందుబి మోగించాలని వారు సూచించారు. ఎనగండ్ల గ్రామ యువ నాయకులు ప్రవీన్ రెడ్డి,పాండు రంగారెడ్డిల ఆధ్వర్యంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్ రాజు మల్లేశం లక్ష్మణ్,చంద్రయ్య,నరేందర్ రెడ్డి,యాదుల్,కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## కన్నెపల్లి,అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్

సకాలంలో పౌష్టికాహారం అందించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి,జులై02(సూర్య రేఖ)** విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.మంగళవారం కన్నెపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.పిల్లల ఎత్తు,బరువు కొలతలు స్వయంగా పరిశీలించారు.శారీరక,మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు.ఆహారం,అవసరమైన మందులు అందించి సాధారణ స్థితికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# నిత్యం ప్రజల కోసమే జీవిస్తున్న.. వారి సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యం

మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం..

ప్రజల ఆలోచనలు,ఆకాంక్షల మేరకు అభివృద్ధి..

నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి







**రాజేంద్రనగర్,జులై02(సూర్యరేఖ)** నిత్యం ప్రజల కోసమే జీవిస్తానని,వారి సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్ గృహ కల్పలోని పింక్ క్వార్టర్ లో స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. ఎన్నో ఏళ్లుగా సుదీర్ఘంగా ప్రజలకు మంచినీరు అందుబాటులో లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ విషయం గ్రహించి నూతన వాటర్ పైప్ లైన్ కనెక్షన్ మంజూరు చేసి వేయించడం జరిగిందన్నారు.పైన అపార్ట్మెంట్స్ కు మంచినీరు అందేవిధంగా తదితర అంశాల గురించి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కరించేంత వరకు కృషి చేస్తామన్నారు.అదేవిధంగా హౌసింగ్ బోర్డ్ సొసైటీ సంబంధించి ఆఫీసర్లతో చర్చించి మరొకసారి ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీరు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా ఇబ్బందులను తొలగించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.ప్రజల సహకారం ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆలోచనలు,ఆకాంక్షల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో పునసమీక్షించి ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికే జనార్ధన్,తలారి చిన్న,బబ్లూ,మోహన్ రెడ్డి అంజమ్మ,అడికే శివ,రాజేష్,సచిన్,ఎన్ను శంకర్ రెడ్డి జలమండలి డీజీఎం రేణుక,జీహెచ్ఎంసీ వర్క్ ఇన్స్పెక్టర్ భాను,బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో హెడ్ కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**మందమర్రి,జూలై02(సూర్య రేఖ)** మందమర్రి మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్ పోస్టుల కొరకు వంట విభాగంలో అనుభవం ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి ఎం.దత్తు మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదవ తరగతి ఉత్తీర్ణులై,సంబంధిత రంగంలో అనుభవం ఉండి,18 నుంచి 45 సంవత్సరంలోపు మహిళలు మాత్రమే అర్హులని,దరఖాస్తుదారులు స్థానికులుగా నిర్ధారిస్తూ మండల తహసీల్దార్ జారీ చేసిన నివాస పత్రం కలిగి ఉండాలని సూచించారు.ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు మండల విద్యా వనరుల కేంద్రంలో ఫారం పూర్తి చేసి,అవసరమైన పత్రాలను జతపరచి సూచించిన గడువులోగా సమర్పించాలని సూచించారు.

## ఖర్గే సభను విజయవంతం చేయాలి..

జులై 4న ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తల సమావేశం..



**కామారెడ్డి,జూలై 02(సూర్యరేఖ)** జూలై 4న రాష్ట్ర రాజధాని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల బహిరంగ సభకు జైబాపు,జైభీమ్,జై సంవిధాన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే హాజరవుతున్నట్లు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,పార్టీ మండల అధ్యక్షులు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ జడ్పిటిసిలు,ఎంపీటీసీలు,సర్పంచులు, సీనియర్ నాయకులు,అనుబంధ సంఘాల కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాలు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ దోపిడి

హద్దే లేని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఫీజు..

పుస్తకాల పేరిట వేలకు వేలు దోపిడీ..

మెటీరియల్ పేరిట మరో అదనపు ఖర్చు..

బయట పుస్తకాలు కొంటె స్కూల్లోకి అనుమతి లేదంటూ హుకుం..

వసతులు నీల్,ఫీజులు ఫుల్..

వార్షిక మామూళ్లతో చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు..

బడి బతుకే భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు..

సరైన క్రీడా ప్రాంగణం లేని పాఠశాల..














విద్య వ్యాపారంగా మారి ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిండి చేస్తున్నారు.ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులకు తమ పిల్లల విద్య కోసం నానా అగచాట్లు పడుతున్నారు.స్థాయికి మించి కడుపు కాల్చుకొని మరి ఉన్నత విద్య కోసం వెంపర్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల మాయలో చిక్కుకొని జేబులు లూటీ చేసుకుంటు న్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేక,ప్రై వేట్ స్కూళ్ల ఆకర్షణలో పడిన తల్లిదండ్రుల నుంచి శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ పుస్తకాల పేరిట దోపిడీ,వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యను లాభాల వ్యాపారంగా మలుస్తున్న విద్యా సంస్థపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**చేగుంట,జూలై 02(సూర్యరేఖ)** ప్రస్తుత సమాజం లో తల్లిదండ్రులకు తమ పిల్లల విద్య కోసం నానా అగచాట్లు పడుతున్నారు.స్థాయికి మించి కడుపు కాల్చుకొని మరి ఉన్నత విద్య కోసం వెంపర్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల మాయలో చిక్కుకొని జేబులు లూటీ చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్య తీరుపై నమ్మకం లేదో లేక ప్రైవేటు పాఠశాలల ఆకర్షణకు గురయ్యారో తెలియదు కానీ మండలంలోని 60 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థలకే పరిమితమవు తున్నారు. జూన్ 12 విద్యావ్యవస్థ ప్రారంభంకాక ముందే పుస్తకాలు కొనాలంటూ లేదంటే అయిపోతాయంటూ బెదిరింపు ధోరణిలు చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు తల్లిదండ్రుల వద్ద పుస్తకాల పేరుతో దోపిడీ చేశారు.నేటికీ పుస్తకాల పేరుతో దోపిడి చేస్తూనే ఉన్నారు.నర్సరీ చదివే విద్యార్థి నుంచి ఐదవ తరగతి చదివే విద్యార్థి వరకు వేలకు వేలు పుస్తకాలకు వసూలు చేస్తున్నారు.కేవలం పుస్తకాల కోసమే వేలకు మించి నగదు ఖర్చు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.ప్రతి తరగతి పెంచుకుపోతూ మెటీరియల్ పేరిట అదనపు పుస్తకాలు అంటూ వేలకు వేలు దోచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నియమావళి ప్రకారం సిలబస్ పుస్తకాలను అన్ని తరగతులకు ఒకటే అయినా ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలు ఇవ్వకుండా మెటీరియల్ పేరిట కార్పోరేట్ స్కూళ్లు కొత్త దందాకు తెరతీశాయి.ఈ పుస్తకాలు బయట మార్కెట్లో ఉండవు కాబట్టి అక్కడే కొనాలని షరతులు విధిస్తూ తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేశారు.ఒక పాఠశాలలో పుస్తకాలు అమ్మాలంటే ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరి అయితే అవి ఏమీ పట్టించుకోకుండా నిబంధనలకు తూట్లు పొడుస్తూ రూ.వేయి విలువ చేయని పుస్తకాలను సుమారు రూ.10 వేల వరకు శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వసూలు చేస్తున్నారు.

**-ఫీజు నిబంధన సరే సరి..**

ప్రైవేటు విద్యాలయాల పుస్తకాల రేటు ఆ తరహాలో ఉంటే విద్యార్థి వార్షిక సంవత్సర ఫీజు ఆకాశమే హద్దుగా మారింది.సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ తీరుపై పూర్తిగా విస్మరిచ్చిందని తల్లిదండ్రులు విమర్శకులు ఎప్పుడూ తెలుపుతూనే ఉన్నా ప్రతి ఒక్క సంవత్సరం ప్రైవేటు విద్యా వ్యవస్థ తల్లిదండ్రుల వద్ద భారీగా దోపిడీ చేస్తుంది.ఏ ఒక్క పాఠశాలలోనూ ఫీజు పట్టిక ఎప్పుడు ఏర్పాటు చేయరు.కనీసం స్కూల్ ల పేరుతో అధికార ఫీజు రుసుము కూడా ఇవ్వరు. చేగుంట మండలంలో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్య వ్యాపారంగా మారిపోయిందని తేటతెల్లమైంది. ఇక వసతుల విషయానికి వస్తే పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఏ వస్తువులు లేకపోగా అన్నీ ఉన్నాయంటూ రంగు బ్రోచర్లలో దర్శనమిస్తాయి. కానీ అరకొర వసతులతోనే విద్యాలయాలను నడిపిస్తున్నారు.

**-చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు..!**

చేగుంట మండలం విద్యాధికారిగా బాధ్యత నిర్వహిస్తున్న అధికారిని తన పరిధిలో ఉన్న శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పాఠ్యపుస్తకాల పేరిట దోపిడీ చేస్తున్న నామ మాత్రపు చర్యలు కూడా తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కుర్చీలకే పరిమితమై వార్షిక మామూళ్లతో మిన్నకుంటున్నారన్న వార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి.ప్రతి సంవత్సరం జూన్ మాసంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేసిన నగదులో ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ముడుపులు అందిస్తున్నారన్న వార్తలు కూడా జోరందుకున్నాయి.ఈ పుకార్లు నిజమయ్యే విధంగా మండల విద్యాశాఖ అధికారిని తీరు విస్మయానికి గురిచేస్తుంది.ప్రైవేటు స్కూళ్లని తనిఖీలు చేయకపోగా ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వైపే మొగ్గుచూపుతూ వివరణలు అందించడం మండల విద్యాశాఖ అధికారికి పరిపాటిగా మారింది పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నార్సింగిలో డ్రగ్స్ పట్టివేత..

**నార్సింగి,జులై 02(సూర్యరేఖ)**నార్సింగిలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. కోటిన్నర విలువ చేసే 650 గ్రాముల హెరాయిన్ ను బుధవారం శంషాబాద్ ఎస్ఓటి పోలీసులు సీజ్ చేశారు.కాగా,నార్సింగిలో డ్రగ్స్ స్మగ్లింగ్ జరుగుతున్నట్లు శంషాబాద్ ఎస్వోటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అనుమానస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.అతడి వద్ద ఉన్న బ్యాగ్ ను పరిశీలించగా..అందులో నిషేధిత హెరాయిన్ ఉన్నట్లు గుర్తించారు.వెంటనే హెరాయిన్ ను స్వాధీనం చేసుకున్నారు.సీజ్ చేసిన 650 గ్రాముల హెరాయిన్ విలువ కోటిన్నర ఉంటుందని అంచనా వేశారు.హెరాయిన్ రాజస్థాన్ లో కొనుగోలు చేసి హైదరాబాద్ కు తరలించినట్లు గుర్తించారు.తానే హెరాయిన్



కంజూమ్ చేస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు నిందితుడిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.హెరాయిన్ విక్రయించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి అతడి కోసం గాలిస్తున్నట్లు నార్సింగ్ పోలీసులు తెలిపారు.

## బురద రోడ్డుగా మారిన బర్రెంకల కట్ట..

**రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు..**

**పట్టించుకొని ప్రజా ప్రభుత్వాలు**



**ముస్తాబాద్,జులై 03(సూర్యరేఖ)** గూడెం గ్రామశివారులోని బొప్ప చెరువు కట్ట కింద నుండి బర్రెంకల కట్టకు వెళ్ళే రోడ్డు వర్షాల కారణంగా ఎప్పుడూ గుంతలు,బురదగా మారుతుంది.వర్ష కాలము వచ్చేసరికి రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.వందలాది మంది రైతులు తమ పంట పొలాలకు వెళ్ళే ఈ రోడ్డు ఎప్పుడూ బురదకుంటలా తయారవుతుంది.కనీసము ఈ రోడ్డు వెంట నడవటానికి కూడా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటే ఈ రోడ్డు ఎలా ఉందో అర్థచేసుకో వచ్చు. గతములో బీఆర్ఎస్ పరిపాలనలో డంబర్ రోడ్డు మంజూరు చేశారు.అప్పుడు అక్కడి రైతుల గొడవతో ఈ డంబర్ రోడ్డును వేరే చోట పోశారు.ఇకనైనా ఇప్పుడున్న ప్రభుత్వం స్పందించి బర్రెంకల కట్ట రోడ్డుకు వెంటనే డంబర్ రోడ్డు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని బర్రెంకల కట్ట రైతులు కోరుతున్నారు.

## ఐటిఐ కాలేజీలో అవకతవకలకు మూలం ఎవరు..!

**సంబంధం లేని వ్యక్తులు ఐటిఐ కళాశాలలో వస్తూ, పోతూ ఉండడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోంది..**



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,జులై 01(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లాలోని ఓ ఐటిఐ కళాశాలలో అవకతవకలు జరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ ప్రిన్సిపాల్ ఉండగా కాంట్రాక్టు బేసిక్ కంప్యూటర్ ఆపరేటర్ అవకతవకలకు మూల పురుషుడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.గతంలో ఈ ఆపరేటర్ రాజధాని హైదరాబాద్ ఐటిఐ ఆఫీసర్ల నుంచి వచ్చినటువంటి ప్రతి సమాచారాన్ని ఓ కాంగ్రెస్ మాజీ నాయకుడికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరా వేస్తూ వరంగల్ ఉన్నతాధికారికి అడ్డంగా పట్టుబడ్డాడు.అధికారి అతనిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా అధికారి కాళ్ళు మొక్కి ఏడుస్తూ నాది తప్పు అయినది మరొకసారి ఇలాంటి పనులు చేయను అని అధికారితో వేడుకున్న కంప్యూటర్ ఆపరేటర్ పై కనికరించి ఆ ఉన్నతాధికారి వార్నింగ్ ఇచ్చి వదిలిపెట్టినట్టు సమాచారం..అంత జరిగిన ఆ కంప్యూటర్ ఆపరేటర్ తన బుద్ధిని మార్చుకోకుండా అదే తతంగాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది.అయినా ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసిన చర్యలు తీసుకోవడంలో ఎందుకు పట్టించుకోవడం లేదని పలుఆరోపణలు వినిపిస్తున్నాయి.అర్హత లేని వారిని ఐటిఐలో ఉద్యోగులుగా చేర్చుకొని ఒక రాజకీయ నాయకుడి అండదండలతో ఐటిఐ కళాశాలను బూజు పట్టిస్తున్నట్లు తెలుస్తుంది. సంబంధం లేని వ్యక్తులు ప్రతిసారి ఐటిఐ కాలేజ్ కి పోతూ వస్తూ ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది.ప్రభుత్వం పంపిణీ చేసిన బట్టల కటింగ్ మిషన్ ను ఓ కంప్యూటర్ ఆపరేటర్ అందులో డ్రెస్ మేకింగ్ గా పని చేస్తున్న మహిళ ఇద్దరు కలిసి ఐటిఐ కళాశాలలో ఉన్న మిషన్ ను ఇతరులకు అమ్ముకోవడానికి ప్లాన్ చేసి ఆ మహిళ ఇంట్లో మిషన్ దాచి పెట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది సమాచారం తెలియడంతో దానిని ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లగా ఉన్నతాధికారి,కాలేజీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురాగా మిషన్ తీసుకెళ్లి ఆరు నెలలు గడుస్తున్న తెలియనట్టుగా ఉండి ఇప్పుడు అతడు మిషన్ తీసుకెళ్లినటువంటి వ్యక్తులకు సమాచారం ఇచ్చారు.వెంటనే ఆ మిషన్ ను తీసుకొచ్చి కాలేజీలో పెట్టాలని ఆదేశించారు.ఆర్డీడీకి సమా చారం అందిన రెండో రోజు ఆ మిషన్ ను తీసుకొచ్చి కాలేజీలో పెట్టడం గమనార్హం. ఇంత జరిగినా కాలేజీ ప్రిన్సిపాల్ కు సమాచారం లేదా.? లేక తెలిసి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారా.! అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.అక్కడ కాలేజీలో సైతం విద్యార్హత లేని వ్యక్తులను నియమించి ఒక నాయకుడు తనకు ఇష్టం వచ్చిన వారిని పంపిస్తూ వారికి ఉద్యోగంలో చేర్చుకోవాలని అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్న ట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన ఐటిఐ కళాశాలలో అధికారుల మధ్య జరిగేటటువంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి తమ వ్యక్తులను అందులో నియమించి అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ లను డమ్మీగా చేసి తమ వ్యక్తుల పెత్తనం నడిపిస్తూ ఆ కాలేజే తనదైనట్లుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తుంది.ఇలాంటి అవకతవకలు జరుగుతుంటే అక్కడ విద్యాబుద్ధులు నేర్చుకొనేటటువంటి విద్యార్థులకు న్యాయం చేయవలసిన ఉన్నత అధికారులు ఈ గల్లీ లీడర్లకు భయపడవలసిన అవసరం ఏమొచ్చిందో అని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారు లు స్పందించి ఆవకతోకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని అక్కడ విద్య నేర్చుకునేటటువంటి విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని పలువురు కోరుతున్నారు.






# ‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్‌లో బాలకృష్ణ!

తెలుగు యువతను విశేషంగా ఆకట్టుకున్న సినిమాలలో ‘ఈ నగరానికి ఏమైంది?’ ఒకటి. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ని అందుకుంది. అయితే ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకుల ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా సీక్వెల్‌ను ప్రకటించాడు దర్శకుడు తరుణ్ భాస్కర్. ‘ఈ%చీ%ఈ రిపీట్’ అనే టైటిల్‌తో ఈ సీక్వెల్ రాబోతుండగా.. విశ్వక్ సేన్, సాయిసుశాంత్‌రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఈ సీక్వెల్‌లో కూడా హంగామా చేయనున్నారు. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో నటుడు నందమూరి బాలకృష్ణ (%దీఖశ్రీఖనెతీఅంష్త్రఖ%) అతిథి పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. విశ్వక్ సేన్‌కి బాలయ్య అంటే ప్రత్యేక అభిమానం. ఇప్పటికే ఈ విషయాన్ని చాలాసార్లు పలు ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చాడు. అయితే ఈ రిలేషన్‌తోనే బాలయ్యని ‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్‌లో నటించమని విశ్వక్ అడిగినట్లు తెలుస్తుంది. దీనికి బాలయ్య కూడా ఒకే చెప్పినట్లు సమాచారం. అయితే ఇది నిజమో కాదో తెలియాలంటే సినిమా వచ్చేవరకు ఆగాల్సిందే. సురేష్ ప్రొడక్షన్ బ్యానర్‌పై డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు నిర్మిస్తున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నాడు.



# చివరి శ్వాస వరకు నటిగానే ఉంటా.. ‘డాక్టర్’ రూమర్‌పై హీరోయిన్ క్లారిటీ

కోమలి ప్రసాద్ నటిగా తెలుగు తెరపై తనకు వచ్చి అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి నటిగా పేరు సంపాదించుకున్నారు. ఇక త్వరలోనే ‘శశివదనే’ చిత్రంతో తెరపైకి రాబోతోన్నారు. ఈలోపు కోమలి ప్రసాద్ మీద సోషల్ మీడియా, మీడియాలో ఓ అసత్య ప్రచారం మొదలైంది. యాక్టింగ్ కెరీర్‌ను వదిలి పెట్టారని, డాక్టర్ వృత్తిలోకి వెళ్లారని కోమలి ప్రసాద్ మీద రూమర్లు క్రియేట్ చేశారు. దీంతో ఈ వార్తల్ని ఖండిస్తూ కోమలి ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్ట్ వేశారు. ‘అందరికీ నమస్కారం. నేను డాక్టర్ అయ్యానని, నటనకు పూర్తిగా దూరం అయ్యానంటూ అసత్య ప్రచారాలు, తప్పుదోవ పట్టించే వార్తల్ని ప్రచురిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు కూడా ఈ రూమర్లను నిజం అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని అందరికీ స్పష్టంగా తెలియజేయాలని అనుకుంటున్నాను. ఎన్నో కష్టాలు ఎదుర్కొని, ఎంతో కష్టపడి ఇప్పటి వరకు సినిమాల్లో కెరీర్‌ను కొనసాగిస్తూ ఈ స్థాయి వరకు వచ్చాను. ఆ శివుని ఆశీస్సులతో నా కెరీర్‌ను ముందుకు సాగిస్తున్నాను. నాలో, నా శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళనలను రేకెత్తించేలా ఈ రూమర్లను ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పుదారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందకూడదని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ స్పష్టతనిస్తూ పోస్ట్ వేస్తున్నాను. చివరి శ్వాస వరకు నటిగా నా బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నా వెన్నంటే ఉన్న నా శ్రేయోభిలాషులందరికీ, నా కంటే నన్ను ఎక్కువగా నమ్మిన వారందరికీ ధన్యవాదాలు. నేను ప్రస్తుతం నా స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా ఎంచుకుంటున్నాను. త్వరలో కొత్త ప్రకటనలతో మీ అందరినీ చాలా గర్వపడేలా చేస్తాను’ అని కోమలి ప్రసాద్ అన్నారు

# అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని మరెవరూ టచ్ చేయలేరు..

పుష్ప2 సినిమా అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని ఆకాశానికి చేర్చిందనేది తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక మంది టాప్ స్టార్స్ ఉండగా ఒక్కసారిగా వీరందరినీ మన బన్నీ దాటేశాడు. తన తదుపరి సినిమాకి ఏకంగా రూ.300కోట్ల రెమ్యునరేషన్ అందుకుంటున్నాడనే వార్త టాప్ బాలీవుడ్ స్టార్స్‌కి కూడా దిమ్మదిరిగిపోయేలా షాక్ ఇచ్చింది. ఓ వైపు ఎంతో కాలంగా ఇంటర్నేషనల్ స్టార్స్‌గా వెలుగొందుతున్న ఎందరో బాలీవుడ్ హీరోలు, మరోవైపు ఇటీవలే గ్లోబల్ స్టార్స్‌గా మారిన దక్షిణాది హీరోలు.. మరి వీరందరిలో భవిష్యత్తులో బన్నీని బీట్ చేయగల హీరో ఎవరు? అనే ప్రశ్నలు చర్చలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని బీట్ చేయడం ఇప్పట్లో మరెవరికీ సాధ్యం కాదు ఓ టాప్ డైరెక్టర్ తేల్చేయడం విశేషం. ఆయన కూడా సాదా సీదా హిందీ సినిమాల దర్శకుడేమీ కాదు అనేక హిట్ చిత్రాలు అందించిన అగ్రగామి బాలీవుడ్ దర్శకుడు మధర్ భండార్కర్ తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. “సమీప రోజుల్లో, ఎవ్వరూ కూడా అల్లూ అర్జున్ దక్కించుకున్న క్రేజ్‌ను కనీసం తాకలేరు. ఆయన నిజమైన పాన్‌ఇండియా స్టార్” అని మధుర్ భండార్కర్ అన్నారు. అంతేకాదు.. పుష్ప సినిమా కోసం అల్లు అర్జున్ ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తీరు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ భారీగా మాస్ ఆకర్షణను సంపాదించి పెట్టిందని ప్రాంతాలకతీతంగా అల్లు అర్జున్‌ను ప్రేక్షకులతో కనెక్ట్ చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. పుష్ప సినిమా విజయం గతంగా మారిపోయినా ఇప్పటికీ అల్లు అర్జున్‌ను ప్రశంసిస్తున్న వారి జాబితా అంతకంతకూ పెరిగిపోతుండడం విశేషం. బన్నీని ఆకాశానికి ఎత్తేస్తున్న బాలీవుడ్ ప్రముఖుల్లో మధుర్ భండార్కర్ మాత్రమే కాదు అల్లు అర్జున్ మాత్రమే పుష్ప చేగలడంటూ బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ అన్నాడు. అతని ఎనర్జీ ఎక్స్‌ట్రార్డినరీ అంటూ యువ హీరో కార్తీక్ ఆర్యన్ పొగిడితే...ఐకాన్‌స్టార్‌తో ఒక్కసినిమాలో అయినా నటించాలని ఉందని బాలీవుడ్ నటి అనన్య పాండే తపిస్తున్నారు. అతని లాంటి డ్యాన్సర్‌ని చూడలేదని టాప్ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ తేల్చేశారు. ఆయన ఎనర్జీ మరెవరికీ సాధ్యం కాదు అని బాలీవుడ్‌లో ఎనర్జిటిక్ హీరోగా పేరున్న షాహిద్ కపూర్ ఒప్పేసుకున్నాడు. అతనో స్టైల్ ఐకాన్ అంటూ మరో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌లు...అభివర్ణించాడు. ఇలా ఎందరో బన్నీపై భారీ స్థాయిలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న అల్లు అర్జున్ అట్లీల సినిమా పై అంచనాలను వీరి అభిప్రాయాలు మరింతగా పెంచేస్తున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో ఆ స్థాయి అంచనాలను అందుకోవడానికి బన్నీ అట్లీ ద్వయం మరింతగా కృషి చేయకతప్పదు.



# బాలీవుడ్‌లో అవకాశాలు.. నా అభిమానులను బాధపెట్టే సినిమాలు చేయను



మంచు విష్ణు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పను బాలీవుడ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్‌తో తీశారు. టాలీవుడ్‌లో ఎవరూ దొరకలేదా? అంటే? వరుస ఫ్లాపులు అందుకున్న తనతో కన్నప్ప వంటి మైథాలజీ సినిమా తీసేందుకు ఎవరూ ముందుకు రారని అసలు విషయం చెప్పారు. అందుకే మహాభారత్ సీరియల్ తీసిన ముకేశ్‌తో కన్నప్ప సినిమాను తెరకెక్కించినట్లు వెల్లడించారు. మరి హీరోగా బాలీవుడ్‌లో అడుగుపెట్టే ఆలోచనలేమైనా ఉన్నాయా? అంటే విష్ణు ఇలా స్పందించారు. ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు మాట్లాడుతూ.. చాలాకాలం క్రితం హిందీలో సినిమా చేయమని కొందరు నన్ను సంప్రదించారు. కానీ వారు ఆఫర్ చేసినవేవీ నాకు నచ్చకపోవడంతో అక్కడ సినిమాలు చేయలేదు. పైగా నటుడిగా నాకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నాను. అదే సమయంలో అభిమానుల ప్రేమను పొందాను. వారిని నేను గౌరవించాల్సిన అవసరం ఉంది. ఏవి పడితే అవి చేసి వారిని నేను బాధపెట్టలేను. ఉదాహరణకు స్టార్ హీరో అజిత్‌ను తీసుకుందాం. ఆయన ఇండియాలోనే పెద్ద సూపర్‌స్టార్స్‌లో ఒకరు. షారూఖ్ ఖాన్ అశోక మూవీలో ఆయన సైడ్ రోల్ చేశారు. అది నాకు నచ్చలేదు. అజిత్ అన్నతో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు.. మీరు ఇంత చిన్న పాత్ర చేసినందుకు నిరాశచెందాను అని చెప్పాను. అందుకాయన చిన్నగా నవ్వి సైలెంట్‌గా ఉండిపోయారు. కాబట్టి ఏదో ఒక రోల్.. అని లైట్ తీసుకుని సినిమా చేయలేను. జనాలకు నచ్చినా, నచ్చకపోయినా నా ఇష్టమొచ్చిన సినిమాలు చేస్తా అని సెల్ఫిష్‌గా ఆలోచించలేను అని విష్ణు చెప్పుకొచ్చారు. కన్నప్ప సినిమా విషయానికి వస్తే.. విష్ణు తిన్నడు/కన్నప్పగా నటించారు. అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ ముఖ్య పాత్రలు పోషించారు. జూన్ 27న విడుదలైన ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ లభించింది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,